PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 80 | విజయవాడ, శుక్రవారం 20 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 20 October 2023 | Rs

విశిష్ట సేవకు గుర్తింపు వైఎస్‌ఆర్ అవార్డు

- ప్రభుత్వ సలహాదారు జివిడి కృష్ణమోహన్

2



కదం తొక్కిన కోహ్లి

- వన్డేల్లో 48వ సెంచరీతో సచిన్‌కు చేరువ
- బంగ్లాదేశ్‌పై 7 వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు

6

రూ.36 కోట్లు పోలీస్ శాఖలో గోల్‌మాల్



- ఆరేళ్లుగా కొనసాగుతున్న అక్రమాలు
- నిందితుడు మాజీ డిజిపి సాంబశివరావు అల్లుడు అవినాష్
- గుంటూరు రేంజ్ డిఐజి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఐజి పాల్‌రాజ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర పోలీసు శాఖలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. వాహనదారులు ఇ-చలానాలుగా చెల్లించిన 36.53 కోట్ల రూపాయలను గుట్టుచప్పుడు కాకుండా స్వాహా చూసిన ఉదంతమిది. ఆరు సంవత్సరాల నుండి కొనసాగుతున్న ఈ వ్యవహారం ప్రస్తుతం పోలీస్ అధికారుల్లో కలకలం రేపుతోంది. తెలుగు దేశం పార్టీ పాలనలో ప్రారంభమైన ఈ దోపిడి వైసిపి ప్రభుత్వ హయంలోనూ కొనసాగింది.

మాజీ డిజిపి నండూరు సాంబశివరావు అల్లుడు కొమ్మిరెడ్డి అవినాష్ కు చెందిన రేజర్ పిఇ ఖాతాకు చలానాల సొమ్ము మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఏళ్లతరబడి సాగుతున్న ఈ అక్రమాలను ఇటీవల తిరుపతి పోలీసు అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా ఉన్నతాధికారులు ఆలస్యంగా స్పందించారు. గుంటూరు రేంజి ఐ.జి.పాలరాజు గురువారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం 2015లో అప్పటి ప్రభుత్వం ట్రాఫిక్ విభాగంలో ఇ-చలానాలు వసూలు బాధ్యతలను కృష్ణా సొల్యూషన్స్ అనే సంస్థకు అప్పగించింది.

2016లో డేటా సెల్యూషన్స్ అనే మరో సంస్థ సాఫ్ట్‌వేర్ సంస్థల ద్వారా తాము అవే సేవలు అందిస్తామని ముందుకు వచ్చింది. కొన్ని సేవలను ఉపయోగించుకున్న అనంతరం 2018లో ఇ-చలానాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ అందించేందుకు పోలీసు శాఖ ఓపెన్ టెండర్స్‌ను ఆహ్వానించింది.ఈ టెండర్లలో కృష్ణా సొల్యూషన్స్ రూ.కోటి 96 లక్షలు కోట్ చేయగా, కేవలం రూపాయికే సాంకేతిక పరిజ్ఞానం అందిస్తామంటూ డేటా సొల్యూషన్స్ టెండరుదాఖలు చేసింది. సాఫ్ట్‌వేర్ అందించేందుకు అందించేందుకు ప్రభుత్వం ఒపెన్ టెండర్‌లో రూ.2 కోట్లును గరిష్టమొత్తంగా పేర్కొంది. అయితే, ఒక్క రూపాయికే టెండర్ దాఖలు చేయడంతో అధికారులు దీనిపై వివరణ కోరారు. ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ స్టేట్‌గా చూపించి మిగిలిన రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్‌ను అమ్ముకుంటామని డేటా సొల్యూషన్స్ నిర్వాహకులు నమ్మించారు. . దీంతో 2018లో డేటా సొల్యూషన్స్‌కు టెండరు అప్పగించారు. ప్రతి రోజూ వాహనదారుల నుంచి వసూలు అయిన చలానాల మొత్తం డిజిపి ఖాతాల్లోకి వెళ్లకుండా వేరే ఖాతాలకు వెళ్లేలా ఆ సంస్థ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. దీంతో పోలీస్ అధికారిక ఖాతాల్లో ఆ మొత్తంలో అధికభాగం జమకాలేదు. మాజీ డిజిపి నండూరు సాంబశివరావు అల్లుడుకి చెందిన కొమ్మిరెడ్డి అవినాష్, మరో డైరక్టర్ అషిత పాత్ర ఈకుంభకోణంలో కీలకంగా ఉందని గుర్తించినట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. ప్రజలనుంచి మొత్తం రూ.100 కోట్లకు పైగా నిధులు ఈచలానాల రూపంలో చెల్లించగా రూ.66.47 కోట్లు మాత్రమే పోలీసు శాఖకు జమ అయ్యాయి. మిగతా రూ.33.53కోట్లు కొమ్మిరెడ్డి అవినాష్ ఖాతాల్లోకి బదిలీ అయినట్లు తేల్చారు. ఈ కుంభకోణంలో అవినాష్‌తో కలిసి పనిచేస్తున్న కొత్తపల్లి రాజశేఖర్‌ను అనే వ్యక్తిని అరెస్టుచేశామని ఐ.జి.పాలరాజ్ తెలిపారు. డేటా సొల్యూషన్స్ డైరెక్టర్స్ గా మాజీ డిజిపి సాంబశివరావు అల్లుడు అవినాష్ తో పాటు అక్షిత అనే మరో మహిళ కూడా ఉన్నారు. ఆమె పాత్రపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఎవరిని వదిలి పెట్టబోమని గుంటూరు రేంజ్ డిఐజి చెప్పారు. కొమ్మిరెడ్డి అవినాష్ బినామీ పేర్లతో ఆస్తులు కొన్నట్టు గుర్తించామని వీటిని విక్రయించకుండా సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశామని, ఈ ఆస్తులను త్వరలో అటాచ్ చేస్తామని వివరించారు. ఇప్పటికే అవినాష్‌ను సంజాయిషీ అడిగినట్టు ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

ఇదీ ప్రజా ప్రణాళిక

ప్రజా సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం మేనిఫెస్టో విడుదల చేసిన సిపిఎం

'అమలు కోసం ఐక్యమవుదాం.. పోరాడుదాం' అని పిలుపు

కులగణనకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ • 15న ప్రజారక్షణ భేరీ



'ప్రజా ప్రణాళిక' విడుదల చేస్తున్న శ్రీనివాసరావు, వైవి, రమాదేవి, వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం పోరాడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యాన రూపొందించిన ప్రజా ప్రణాళికను గురువారం విజయవాడలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, డి రమాదేవి, వి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నవంబరు 15న ప్రజారక్షణ భేరి పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందు మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలు సొంత అజెండాల చుట్టూ తిరుగుతున్నాయని అన్నారు. వీటిని ప్రజా సమస్యల చుట్టూ మళ్లించాలనే ప్రయత్నం చేస్తున్నామని, దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉందని, 339 మండలాల్లో కరువు పరిస్థితులున్నాయని, కృష్ణా డెల్టాలో కొన్ని వేల ఎకరాల్లో పంట ఎండిపోతోందని వివరించారు. దీనిపై ఎన్యూమరేషన్ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుభరోసా కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించి కరువు నుంచి కాపాడాలని సూచించారు. పంట దెబ్బతినడం వల్ల వరిలో తాలు, తప్ప వస్తుందే తప్ప ఉపయోగం ఉండదని అన్నారు. చాలా ప్రాంతాల్లో ప్రజలకు తాగేందుకు మంచినీరు కూడా లేదని, జ్వరాలు పెరుగుతున్నాయని అన్నారు. వైరల్ ఫీవర్లు వస్తే ఎక్కువ రోజులు ఉండటం, వచ్చినవారు నిస్సత్తువగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటుచేసి జ్వరాలకు మూల కారణాలు గుర్తించి దాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కులగణనను తాము స్వాగతిస్తామని అయితే రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ నవంబరు 15 నుంచి కులగణన చేస్తామని చేసిన ప్రకటన నాన్ సీరియస్‌గా వుందని, దానికి ఎలాంటి చట్టబద్ధత గానీ, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ గానీ లేదని తెలిపారు. కులగణనను వలంటీర్లతో చేయిస్తామని చెబుతున్నారని, దీనివల్ల కొత్త తగాదాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. రెవెన్యూ యంత్రాంగం ద్వారానే ఈ సర్వే జరగాలని అన్నారు. ఈ విషయం జాతీయస్థాయిలో వివాదాస్పదంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో సాంకేతికంగా, వివాదరహితంగా చేయాలని అయితే ప్రభుత్వంలో అటువంటి చర్యలేవీ కనిపించడం లేదని విమర్శించారు. కేబినెట్ నిర్ణయం తీసుకుని ఒక పద్ధతి ప్రకారం చేయాలని అన్నారు. బిసిలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కంటే వారి ఓట్లు గుంజుకోవాలనే తాపత్రయమే ఇందులో ఎక్కువగా కనిపిస్తోందని అన్నారు. అన్ని కులాల లెక్కలు వస్తే భవిష్యత్ చర్యలకు అవకాశం ఉంటుందని అన్నారు. గతంలో దసరా పండగ సందర్భంలో రేషన్‌కార్డుదారులకు బియ్యం, పప్పులు, నూనె ఇచ్చేవారని, ఈ ఏడాది అదేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి వాటిని అందించాలని కోరారు. టిటిడి నిధుల్లో ఒకశాతం తిరుపతి అభివృద్ధికి ఖర్చు చేయాలన్న నిర్ణయాన్ని బిజెపి, విహెచ్‌పి వ్యతిరేకించడం దుర్మార్గమని తెలిపారు. అందరికీ మేలు జరిగేలా టిటిడి అన్నిటికీ నిధులు ఇస్తోందని దీన్ని మతపరమైన కోణంలో వ్యతిరేకించడం సరికాదని పేర్కొన్నారు. వివాదం చేసి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బిజెపి కుట్రచేస్తోందని అన్నారు. మతోన్మాదంతో గుళ్లోకి మిగతా 2లో

కెసిఆర్ పాలనకు స్వస్తి పలకాలి

- బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం ఒక్కటే..
- ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

' బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం ఒక్కటేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించారు. పేదల ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌వైపే ఉంది. కుల గణన చేపట్టేందుకు బిఆర్‌ఎస్, బిజెపి జంకుతున్నాయ్.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపడుతాం. ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం..' అని ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఎ న్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో పాదయాత్ర, రోడ్‌షోల్లో రాహుల్ గాంధీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తానని కెసిఆర్, పేదల బ్యాంక్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తానని ప్రధాని మోడీ ఇద్దరూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. సింగరేణిని అదానీకి అప్పజెప్పేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తే అడ్డుకున్నామని తెలిపారు. ఒబిసిల జపం చేసే ప్రధాని మోడీ ప్రభుత్వంలో 90 మంది కార్యదర్శులు ఉంటే.. వారిలో ముగ్గురే ఒబిసిలు ఉన్నారని తెలిపారు. పేదలకిచ్చే స్కీములకు ఎన్ని నిధులు కేటాయించాలి?., ప్రభుత్వ ఆస్తులు ఏవి అమ్మాలనే లెక్కలు తీస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తాను ప్రశ్నిస్తే పార్లమెంట్‌లో మోడీ కనీసం సమాధానం ఇవ్వలేదన్నారు. పైగా బిజెపిని ప్రశ్నిస్తున్నాననే కక్షతో తనపై 27అక్రమ కేసులు బనాయించి పార్లమెంట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేసి.. ఇంటిని సైతం ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను వెనక్కి తగ్గనని, ప్రజల పక్షానే పోరాడుతానని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామన్నారు. వచ్చిన తొలి రోజుల్లోనే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి ఆయా కులాల వారీగా రాజకీయంగా, ఆర్థికంగా న్యాయం చేకూర్చుతామని అన్నారు.

రాబోయేది కురుక్షేత్ర సంగ్రామం

- పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం
- గతంలో కంటే తక్కువ అప్పులు
- ఎమ్మిగనూరు జగనన్న చేదోడు సభలో సిఎం జగన్
- రూ.3.25 లక్షల మంది ఖాతాల్లో రూ.325 కోట్లు జమ



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు బహిరంగసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాబోయేది కురుక్షేత్ర సంగ్రామమని, వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాము గతంలో ఎప్పుడూ చేయని విధంగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ.2.38 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. జగనన్న చేదోడు నాలుగో విడత జమ కార్యక్రమాన్ని గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించారు. 3.25 లక్షల మంది ఖాతాల్లో రూ.325 కోట్లు జగనన్న చేదోడు మొత్తాన్ని బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ... ఏ పార్టీకి ఓటేశారో అడగకుండా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అదే బడ్జెట్ అదే రాష్ట్రమని, మారిందల్లా కేవలం ముఖ్యమంత్రి మాత్రమేనని చెప్పారు. అప్పుల పెరుగుదల కూడా గతం కంటే తక్కువేనన్నారు. గతానికి ఇప్పటికీ తేడా ఏంటో ఆలోచన చేయాలన్నారు. అప్పట్లో గజదొంగల ముఠా రాష్ట్రాన్ని దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు బటన్ నొక్కితే డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని వివరించారు. వైద్యం అవసరమైతే తోడుగా ఉండే ప్రభుత్వం, ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ తమ దగ్గరకే వచ్చే ప్రభుత్వం, ఇల్లు కట్టించే తపన ఉన్న ప్రభుత్వం కావాలని, ప్రతి పేద కుటుంబం కోరుకుంటుందని తెలిపారు. చంద్రబాబు పాలన చూస్తే కుప్పంలోని ప్రజలకు కూడా చంద్రబాబు మావాడు అని చెప్పుకునే పరిస్థితి లేని పాలన కనిపిస్తుందన్నారు. ఎన్నికలప్పుడు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణమాఫీ కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని వినిపించేదనీ, బాబు సిఎం అయిన తర్వాత రుణమాఫీ కథ పక్కన పెడితే సున్నా వడ్డీ పథకాన్ని కూడా ఎత్తేశారని విమర్శించారు. గతంలో మేనిఫెస్టోను ఎన్నికలయ్యాక చెత్తబుట్టలో వేశారని, 10 శాతం హామీలను కూడా అమలు చేయలేదని తెలిపారు. తాము మేనిఫెస్టోలోని 99 శాతం వాగ్దానాలను అమలు చేశామన్నారు. జన్మభూమి కమిటీలు, రాజధాని భూములు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ గ్రిడ్, చివరికి మద్యం కొనుగోళ్లలో కూడా దోచుకున్నారని విమర్శించారు. ఇప్పుడు లంచాలు అడిగేవారు, వివక్ష చూపే వారు లేరని తెలిపారు. పొదుపు సంఘాలను మోసం చేస్తూ సున్నా వడ్డీ పూర్తిగా ఎత్తేసారని, మీ బిడ్డ సిఎంగా వచ్చి పొదుపు సంఘాలకు తోడుగా ఉన్నారని చెప్పారు. స్వతంత్రం వచ్చాక నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే తాము 2.07 లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. గతంలో పెన్షన్, రేషన్ కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరుగుతూ లంచాలు మిగతా 2లో

జైలులో భద్రతపై చంద్రబాబు అనుమానం

- వచ్చే నెల 1 వరకు రిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు కల్పిస్తున్న భద్రత పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనకు కొన్ని అనుమానాలున్నాయని న్యాయమూర్తికి తెలియజేశారు. చంద్రబాబు 40 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉంటున్న సంగతి తెలిసిందే. గురువారంతో రిమాండ్ గడువు ముగియడంతో ఆయనను ఎసిబి న్యాయమూర్తి ఎదుట వర్చువల్‌గా హాజరుపరిచారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని ఎసిబి న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. తన భద్రత విషయంలో కొన్ని అనుమానాలు ఉన్నాయని ఈ సందర్భంగా న్యాయమూర్తికి తెలిపారు. ఆ విషయాలను రాతపూర్వకంగా ఇవ్వాలని చంద్రబాబుకు న్యాయమూర్తి సూచించారు. ఆయన రాసే లేఖను తనకు పంపించాలని జైలు అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. చంద్రబాబు ఆరోగ్యంపై జైలు అధికారులను కూడా ప్రశ్నించారు. మెడికల్ రిపోర్టులను ఎప్పటికప్పుడు కోర్టుకు నివేదించాలని ఆదేశించారు. అనంతరం రిమాండ్‌ను వచ్చే నెల నవంబరు 1 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు.

కార్పొరేట్ల కోసమే విద్యుత్ సంస్కరణలు

- డేటా సేకరణ కోసమే స్మార్ట్ మీటర్లు
- ప్రీపెయిడ్‌తో వ్యవసాయ పంపుసెట్లకు ఆటంకం
- సిపిఎం రాష్ట్ర సదస్సులో వక్తలు

3

కనీస వేతనాలను నిర్ధారించిన కార్మికశాఖ

- కనిష్టం రూ.11,405, గరిష్టం రూ.13,062

3

మైనార్టీలపై పెరిగిన దాడులు

- రాజకీయ పార్టీలు బిజెపి వైపా? ప్రజాస్వామ్యం వైపో తేల్చుకోవాలి
- రాష్ట్ర మైనార్టీ సదస్సులో మధు, గఫూర్



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో దేశంలో, రాష్ట్రంలో మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని ఈ దాడులను కాంగ్రెస్, వైసిపి, టిడిపి, జనసేన రాజకీయ పార్టీలు ఖండించలేదని, మైనార్టీలకు అండగా, వారి హక్కుల సాధనకు సిపిఎం కట్టుబడి పనిచేస్తోందని మాజీ పార్లమెంట్ సభ్యులు, సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో మైనార్టీ రాష్ట్ర సదస్సును గురువారం నిర్వహించారు. మైనార్టీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ చిష్టి అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. మైనార్టీల జోలికి వస్తే బిజెపి పతనం తప్పదన్నారు. టిడిపి, బిజెపి, జనసేనలు తెలుగు రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. స్కిల్ స్కామ్ కేసులో జైలులో ఉన్న చంద్రబాబు నాయుడును ఎల్లకాలం జైలులోనే ఉంచరని తెలిపారు. మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బిజెపికి వ్యతిరేకంగా పనిచేసే పార్టీలతో కలిసి పనిచేస్తామన్నారు. ఉత్తరాంచల్లో 350 మసీదులు కూలగొట్టారన్నారు. పౌరస్మృతి, మతోన్మాదంతో రెచ్చిపోతున్న బిజెపిపై పోరాటం సాగించేది సిపిఎం మాత్రమేనని చెప్పారు. బిజెపితో వద్దు లౌకికవాదంతో ముద్దు అనే నినాదంతో కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలు ఏకం కావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ.. బిజెపితో అంటకాగుతున్న ప్రభుత్వాలు ప్రజాగ్రహాలకు గురై పతనం కాక తప్పదని హెచ్చరించారు. మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి, వారి అభివృద్ధి కోసం ఎటువంటి విధానాలు కావాలనే అంశంపై చర్చించి సిపిఎం ఆధ్వర్యంలో ఆయా అంశాలపై తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజాపక్షమా? బిజెపి పక్షమా? అనేది తేల్చుకోవాలని సవాల్ విసిరారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ ప్రసంగించారు. పలు జిల్లాల మైనార్టీ నాయకులు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నెతన్యాహుతో రిషి సునాక్ భేటీ

- ఈజిప్ట్‌తో కలిసి పనిచేస్తామన్న జిన్‌పింగ్
- అబ్బాస్‌కు మోడీ ఫోన్



నెతన్యాహుతో సమావేశమైన రిషి సునాక్

గాజా/ జెరూసలెం/ న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఘర్షణలు పెచ్చరిల్లి యావత్ పశ్చిమాసియాకు విస్తరించకుండా చూడడం ముఖ్యమని బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్ పేర్కొన్నారు. ఇందుకోసమే పశ్చిమాసియా ప్రాంత నేతలను కలిసి మాట్లాడాలనుకుంటున్నట్లు చెప్పారు. గాజాను అష్ట దిగ్బంధనం చేసి, అక్కడి ఆసుపత్రిపై అమానుష దాడికి దిగిన ఇజ్రాయిల్ చర్యలపై ప్రపంచ వ్యాపితంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న తరుణంలో బైడెన్, సునాక్‌లు ఒకరి తరువాత ఒకరు వచ్చి నెతన్యాహుకు మద్దతు పలకడం గమనార్హం. పశ్చిమాసియాపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించే వ్యూహంలో భాగంగానే ఇజ్రాయిల్ దుశ్చర్యలను పశ్చిమ దేశాలు గుడ్డిగా సమర్థిస్తున్నాయి. గాజా ఆసుపత్రిపై దాడి ఇజ్రాయిల్ చేసినట్టుగా లేదని, ఎవరో ప్రత్యర్థుల పనిలా ఉందని బైడెన్ చెప్పిన దానికి కొనసాగింపుగా సునాక్ ఓ ప్రకటన చేశారు. ఇజ్రాయిల్ అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో దానికి మద్దతు తెలపడానికి వచ్చానన్నదే ఆ ప్రకటన. ఆకలి దప్పులతోఅల్లాడుతున్న గాజా వాసుల దీన స్థితి గురించి, బాంబు దాడుల్లో కుటుంబాలకు కుటుంబాలే తుడిచిపెట్టుకుపోతున్న పెను విషాదం గురించి, గాజా వాసులకు అందించాల్సిన మానవతా సాయం గురించి బైడెన్ కానీ, సునాక్‌గానీ ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. సునాక్ టెల్ అవీవ్‌కు చేరుకోగానే ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌తో సమావేశమయ్యారు. హింస మరిన్ని ప్రాంతాలకు విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు ఆ తరువాత మీడియాకు ఆయన తెలిపారు. మొత్తంగా మధ్య ప్రాచ్యంలో హింస, ఘర్షణలు పెచ్చరిల్లకుండా చూడాల్సిన అవసరాన్ని ఇరువురు నేతలు నొక్కి చెప్పారని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

రష్యా నుంచి 27 టన్నుల సాయం

27టన్నుల సాయాన్ని గాజాకు పంపుతున్నట్లు రష్యా తెలిపింది. మాస్కో నుండి ప్రత్యేక విమానం ఈజిప్ట్‌కు చేరుతుందని, అక్కడ రష్యా మిగతా 5లో

ఈ నెల్లో 7 రోజులు ఓడీలో

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానా ఇంకా ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే కొనసాగుతోంది. ఈ మూడో త్రైమాసికంలోని తొలి నెల తొలి 13 రోజుల్లోనే ఏకంగా ఏడు రోజులు ఓడీలో ఉంది. 13వ తేదీ నాటి వివరాల మేరకు రూ.470 కోట్ల వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉండడం గమనార్హం. ఆ రోజు వచ్చిన ఆదాయం మొత్తాన్ని ఓడీ కింద రిజర్వ్‌బ్యాంకు మినహాయించుకోగా, ఇంకా రూ.470 కోట్లు ఓడీ కింద మిగిలి ఉందని అధికారులు వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఎన్నికల విధులకు రెండు రోజులు విరామం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, జిల్లా స్థాయిలో ఎలక్షన్ ఆఫీసర్లకు ఈ నెల 23, 24వ తేదీల్లో సెలవులు మంజూరు చేస్తున్నట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో జరిగే ఎన్నికల కోసం ఇవిఎంలకు ఎఫ్ఎల్‌సి (ఫస్టు లెవెల్ చెకింగ్) ఈ నెల 10వ తేదీన మొదలైందని అన్నారు. దసరా నేపథ్యంలో రెండు రోజులు సెలవు ఇవ్వాలని రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఎన్నికల సంఘానికి ఇటీవల వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సిఇఒ ఎంకె మీనా రెండు రోజులపాటు చెకింగ్‌లకు విరామం ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

చంద్రబాబు అక్రమాలపై నిజం గెలవాలి

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను మేనేజ్‌చేస్తూ చట్టపరంగా విచారణలను తప్పించుకున్న చంద్రబాబు నాయుడు విషయంలో నిజం గెలవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. టిడిపి తరపున నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి, నారా లోకేష్ చేపట్టనున్న భవిష్యత్‌కు భరోసా కార్యక్రమాలపై మంత్రి అంబటి రాంబాబు గురువారం మీడియాతో మాట్లాడారు. నారా భువనేశ్వరి నిజం గెలవాలి అనే పేరుతో చేపట్టిన యాత్రతో చంద్రబాబు అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయన్నారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే ఏ కోర్టుకు వెళ్లినా చుక్కెదురవుతోందన్నారు. చంద్రబాబు జైల్లో నుంచి కూడా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శిస్తానని బాలకృష్ణ అంటే.. ఇప్పుడు ఆయన్ను కాదని భువనేశ్వరి వెళ్లేలా ప్రణాళిక తయారు చేశారని అన్నారు. నారావారి చేతిలోంచి పార్టీ నందమూరి వారి చేతిలోకి వెళ్తుందనే భయంతోనే ఈ మార్పు చేశారని విమర్శించారు.

తాడేపల్లిలో బాలినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని తాడేపల్లిలోని సిఎం కార్యాలయానికి పిలిపించి మందలించినట్లు తెలిసింది. ఇటీవల తన గన్‌మెన్‌లను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ వార్తల్లోకి ఎక్కిన తీరుపట్ల వైసిపి అధిష్టానం సీరియస్‌గా వున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే సిఎంఒ గురువారం బాలినేని శ్రీనివాసరెడ్డిని పిలిపించినట్లు సమాచారం. ఆయన మంత్రి పదవి పోయినప్పటి నుండి నియోజకవర్గంలో, ప్రకాశం జిల్లాలో ఇబ్బంది పడుతున్న తీరును వివరించినట్లు తెలిసింది. పోలీసులు తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందునే గన్‌మెన్‌లను సరెండర్ చేసినట్లు సిఎంఒలో ధనంజయరెడ్డికి సంజాయిషీ ఇచ్చుకున్నారని సమాచారం.

రాబోయేది కురుక్షేత్ర సంగ్రామం

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాల్సిన పరిస్థితులు, ఎరువుల కోసం రైతులు చనిపోయే పరిస్థితి ఉండేదని, ఈ రోజు అక్కచెల్లెమ్మలకు, అవ్వతాతలకు, రైతులకు తోడుగా వలంటీర్లు ఉంటున్నారన్నారు. ఓటు వేసేటప్పుడు ఇంట్లో మంచి జరిగిందా లేదా కొలమానంగా తీసుకోవాలని, తాను నమ్ముకున్నది ప్రజలనేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంపి సంజీవ్ కుమార్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సిఎం పర్యటన నేపథ్యంలో పలువురి అరెస్ట్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆదోనిలో టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. సిఎం పర్యటన ముగిసిన తరువాత అరెస్ట్ చేసిన నాయకులను వదిలేశారు.



సంఘీభావం తెలుపుతున్న రమాదేవి



పల్నాడు జిల్లా నరసరావుపేటలో దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ఎంఎ గఫూర్, పి.మధు

ఒపిఎస్ సాధనకు రాజీలేని పోరు

- 'దీక్ష'బూనిన ఉపాధ్యాయులు
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. జిపిఎస్ మాకొద్దు, ఒపిఎస్ అమలు చేయాలని నినదించారు. ఒపిఎస్ సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దీక్షకు పలు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో దీక్షా శిబిరాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, మాజీ ఎంపి పి మధు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఒపిఎస్ అమలు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటం న్యాయమైందని,అందరూ నైతికంగా మద్దతివ్వాలని కోరారు. ఏలూరులో దీక్షలను ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ప్రారంభించి మాట్లాడారు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాల్సిందిపోయి జిపిఎస్ అనే ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేయడం సరికాదన్నారు. దీని వల్ల లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోతారని తెలిపారు.

విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలోని దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు కె జోజయ్య సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్పొరేట్ల సేవకు ఉపయోపడే జిపిఎస్ విధానం వద్దని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతనిచ్చే ఒపిఎస్ సాధించి తీరాలని చెప్పారు. ఒపిఎస్‌ను ప్రభుత్వం పునరుద్ధరించకపోతే ప్రజా ఉద్యమం వస్తుందని హెచ్చరించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళా కన్వీనర్ కె ధనలక్ష్మి, ఎపిఎన్‌జిఒ సంఘం నాయకులు విద్యాసాగర్, తదితరులు సంఘీభావం ప్రకటించారు. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు కుమార్ రాజా, తదితరులు దీక్షలో కూర్చొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, కాకినాడలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, అమలాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు దీక్షలను ప్రారంభించారు. జిపిఎస్‌ను రద్దు చేయాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. శ్రీకాకుళంలో దీక్షలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదర్ రవీంద్ర ప్రారంభించారు.

అనంతపురం కలెక్టరేట్ ఎదుట దీక్షలను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రారంభించారు. సిపిఎస్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని అంబేద్కర్ సెంటర్‌లో, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో దీక్షలు చేపట్టారు. కృష్ణ జిల్లా మచిలీపట్నంలో మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు దీక్షలను ప్రారంభించారు. కడప, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో దీక్షలను నేతలు ప్రారంభించి సంఘీభావం తెలిపారు.



విశిష్ట సేవకు గుర్తింపు వైఎస్ఆర్ అవార్డు

- ప్రభుత్వ సలహాదారు జివిడి కృష్ణమోహన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ రంగాల్లో సమాజానికి విశిష్ట సేవలు అందించి తమదైన ముద్ర వేసిన వారికి దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వైఎస్ఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతోపాటు ఎచీవ్‌మెంట్ అవార్డులు ఇస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) జివిడి కృష్ణమోహన్ తెలిపారు. గురువారం వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సమాచారశాఖ కమిషనరు టి విజయకుమార్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

అవార్డుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించిందని తెలిపారు. ఈ కమిటీ వివిధ రంగాల్లో నిపుణులైన వారిని, రాష్ట్రానికి వేర్వేరు రంగాల్లో సేవలు అందించిన వారిని ఎంపిక చేసిందని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను వివిధ స్థాయిల్లో పరిశీలించిన అనంతరం అవార్డులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 27 అవార్డులను సిఫార్సు చేసి, ముఖ్యమంత్రి ఆమోదం మేరకు ప్రకటించినట్లు తెలిపారు. నవంబరు ఒకటోతేదీన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున అవార్డుల బహూకరణ జరుగుతుందని పేర్కొన్నారు. అవార్డులతోపాటు కొంత నగదు ఇస్తామని, అయితే అది ప్రదానం కాదని, వారు చేసిన సేవలు కీలకమని కృష్ణమోహన్ వివరించారు. లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డుకు రూ.10 లక్షలు, ఎచీవ్‌మెంట్ అవార్డుకు ఐదు లక్షలు ఇస్తామని వివరించారు.

అవార్డులు పొందింది వీరే...

వ్యవసాయంలో పంగి వినీత, వైవి మల్లారెడ్డి, ఆర్ట్ అండ్ కల్చర్‌లో యడ్ల గోపాలరావు, తలిశెట్టి మోహన్, కోట్ల సచ్చిదానందశాస్త్రి, కోన సన్యాసి, ఉప్పాడ హ్యాండ్ అండ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ, ఎస్‌వి రామారావు, రావు బాల సరస్వతి, తల్లావఝుల శివాజి, కలీసాహెచ్ మహబూబ్, షేక్ మహబూబ్ సుభానీ దంపతులకు అవార్డులు అందాయి. అలాగే తెలుగు భాష, సాహిత్య రంగంలో బేతవోలు రామబ్రహ్మం, ఖదీర్‌బాబు, మహెజబీన్, నామిని సుబ్రహ్మణ్యం, అట్టాడ అప్పలనాయుడు, క్రీడా రంగంలో పుల్లెల గోపీచంద్, కరణం మల్లీశ్వరి, వైద్య రంగంలో ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇసి వినయ్‌కుమార్‌రెడ్డి, మీడియా రంగంలో గోవిందరాజు చక్రధర్, హెచ్‌ఆర్‌కె అవార్డుకు ఎంపికయ్యారు. వీరితోపాటు సమాజ సేవా రంగంలో బెజవాడ విల్సన్, శ్యామ్ మోహన్, నిర్మల హృదయ భవన్ (విజయవాడ), డాక్టర్ జి సమరం ఉన్నారు.

ఓట్ల కోసం దిగొచ్చిన కేంద్రం

- ఎన్ఎండిసి స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించం
- జగదల్‌పూర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖబ్యూరో



ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రయివేటీకరణ అజెండాను కేంద్ర ప్రభుత్వం పక్కనపెట్టినట్టు స్పష్టమవుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఏ రకంగా అయితే అమ్మకానికి మోడీ సర్కారు పెట్టిందో ఛత్తీష్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లాలోగల ఎన్ఎండిసి నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌పైనా ఇదే విధానంతో వెళ్లి తాజాగా వెనకడుగు వేయడం శుభపరిణామం. ఛత్తీష్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌లో గురువారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. 'ఎన్ఎండిసి స్టీల్‌ప్లాంట్ (నాగర్‌నార్) బస్తర్ జిల్లా ప్రజలకు చెందినది దాన్ని ప్రయివేటీకరించబోము' అంటూ వ్యాఖ్యానించారు. ఈ స్టీల్‌ప్లాంట్‌ను బిజెపి ప్రయివేటీకరిస్తోందని, బస్తర్ జిల్లా మనోభావాలను దెబ్బతీస్తుందంటూ కాంగ్రెస్ చేపట్టిన ప్రచారంతో బిజెపిలో వణుకుపుట్టింది. నవంబర్ 7, 17న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోతామని బిజెపి భావించింది. దీంతో ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని అమిత్ షా ప్రకటించారు.

శుభపరిణామం: ఉక్కు పరిరక్షణ కమిటీ కో-కన్వీనర్ అయోధ్యారామ్

నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఉపసంహరించుకున్నట్లు అమిత్ షా ప్రకటించడాన్ని స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం హర్షం వ్యక్తం చేస్తుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యారామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదలకు ఈ ప్రాంత ప్రజలు, కార్మికవర్గం చేస్తోన్న పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పదన్నారు.

కాశ్మీరీ జర్నలిస్టుకు అవార్డు ప్రకటించి.. ఆపై రద్దు

- హిందుత్వవాదుల బెదిరింపులతో పుణె ఇనిస్టిట్యూట్ నిర్ణయం

న్యూఢిల్లీ : కాశ్మీరీ జర్నలిస్టు సఫీనా నబీకి పుణెలోని మహారాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - వరల్డ్ పీస్ యూనివర్సిటీ (ఎంఐటిడబ్ల్యుపియు) జర్నలిజం విభాగంలో ప్రకటించిన అవార్డును ప్రదానం చేసేందుకు నిరాకరించడం చర్చనీయాంశమైంది. హిందుత్వ వాదుల ఒత్తిడితో ఆమెకు ఈ అవార్డును అందజేసేందుకు నిరాకరించినట్లు తెలిసింది. ఆమె భారత ప్రభుత్వ విదేశీ విధానానికి వ్యతిరేకంగా అభిప్రాయాలను వ్యక్తం చేశారని, ఆమెకు అవార్డు ప్రదానం చేయడం వివాదాలకు దారితీసే అవకాశమున్నందున అవార్డును రద్దు చేశామని గురువారం ఎంఐటిడబ్ల్యుపియు తెలిపింది. ఏడుగురితో కూడిన జ్యూరీ ఆమెను ఏకగ్రీవంగా ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 17న పుణె అవార్డు స్వీకరణకు వెళ్లాల్సి ఉండగా, 16 మధ్యాహ్నం అవార్డు రద్దు చేసినట్లు ఫ్యాకల్టీ సభ్యుడి నుంచి తనకు ఫోన్ వచ్చిందని సఫీనా ది వైర్ మీడియా సంస్థకు తెలిపారు.

సఫీనాకు అవార్డును రద్దు చేసినట్లు తెలుసుకున్న జ్యూరీ సభ్యులు సునంద, సందీప్, వేణు 'మీడియా- ప్రజాస్వామ్యం' అనే అంశంపై చర్చకు హాజరయ్యేందుకు నిరాకరించారు. ఈ విషయాన్ని వేణు మీడియాకు చెప్పారు.

దసరా సెలవుల ప్రత్యేక బెంచ్‌కు చంద్రబాబు బెయిల్ కేసు

- మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దు : ప్రభుత్వం
- వైద్య నివేదికలు సమర్పించండి
- జైలు అధికారులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ ఇవ్వాలంటూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌ను దసరా సెలవుల్లో కేసుల విచారణ చేసే ప్రత్యేక బెంచ్ విచారణ చేస్తుందని హైకోర్టు ప్రకటించింది. వెకేషన్ బెంచ్ ఎదుట విచారణకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ కె సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ కేసులో ఎసిబి కోర్టు బెయిల్ ఇవ్వకపోవడంతో చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. చంద్రబాబు 40 రోజులుగా రాజమండ్రి జైల్లో ఉన్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి న్యాయవాది వివరించారు. కనీసం రెండు వారాలపాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించిందని ప్రభుత్వం తరపున అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ ఉందని, తీర్పు వాయిదా పడిందని, ఈ పరిస్థితుల్లో బెయిల్ ఇవ్వొద్దని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు.. తదుపరి విచారణ నాటికి చంద్రబాబు వైద్య నివేదికలను అందజేయాలని జైలు అధికారులను ఆదేశించింది.

ప్రొటోకాల్ పాటించండి

ఈ నెల 20న జరిగే ద్రవిడియన్ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే కంచర్ల శ్రీకాంత్ విషయంలో ప్రొటోకాల్ పాటించాలని ఆ వర్సిటీ రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశించింది. గత ఆహ్వాన పత్రికను సవరించాలని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మధ్యంతర ఆదేశాలిచ్చారు. 26వ ఫౌండేషన్ డేకు ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్సీ వేసిన పిటిషన్‌లో ఉత్తర్వులు జారీ చేసింది.

రుషికొండ వివాదంపై త్వరగా తేల్చండి

రుషికొండను అక్రమంగా తవ్వేసి భవనాల నిర్మాణం చేశారనే పిల్‌పై సత్వరమే తీర్పు చెప్పాలని హైకోర్టును ఎంపి రఘురామ కృష్ణరాజు తరపున న్యాయవాది ఉమేష్ చంద్ర హైకోర్టును కోరారు. రుషికొండలో కట్టిన భవనాల్లోకి ఆఫీసుల తరలింపునకు జిఒలు వెలువడ్డాయని, ఈ నేపథ్యంలో తీర్పును సత్వరమే వెలువరించాలని కోరారు. ఈ అభ్యర్థనను పరిశీలిస్తామని సిజె బెంచ్ ప్రకటించింది.

మార్గదర్శి ఖాతాల స్తంభన నోటీసుల సస్పెన్షన్

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ చీరాల, విశాఖ, విశాఖలోని సీతంపేట బ్రాంచుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తూ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సస్పెండ్ చేసింది. పోలీసులు వేర్వేరుగా తీసుకున్న నిర్ణయాలను అమలును నిలిపివేస్తూ జస్టిస్ సుబ్బారెడ్డి మధ్యంతర ఆదేశాలిచ్చారు. బ్యాంకు ఖాతాలను తిరిగి నిర్వహించుకునేలా ఆయా బ్యాంక్ మేనేజర్లకు అనుమతినిచ్చారు. పోలీసుల చర్యల కారణంగా మార్గదర్శి కంపెనీ కంటే అందులోని చందాదారులకు నష్టం చేకూరుతుందన్నారు. ఆ బ్రాంచ్ మేనేజర్లు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో పోలీసులు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. దసరా సెలవుల తర్వాత విచారణ చేస్తామన్నారు.

ములాఖత్‌ల సంఖ్యను పెంచాలని పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజమండ్రి జైలులో చంద్రబాబు ములాఖత్‌ల సంఖ్యను పెంచాలని ఆయన తరపున న్యాయవాదులు ఎసిబి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం రోజుకు రెండుసార్లు వున్న లీగల్ ములాఖత్‌లను తగ్గించి ఒక్కసారికే పరిమితం చేసి చంద్రబాబును ఇబ్బంది పెడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయపరమైన అంశాలను చర్చించేందుకు రోజుకు మూడు సార్లు ములాఖత్‌లు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. పిటిషన్లపై చంద్రబాబుతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక రెట్టింపు దోపిడీకి జగన్ సిద్ధం

- మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తమ్ముడి ద్వారా రెట్టింపు ఇసుక దోపిడీకి రంగం సిద్ధం చేశారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. గతంలో జెపి సంస్థ మాదిరే ఇప్పుడు ఢిల్లీ కంపెనీని తెరముందు పెట్టి, వెనక తన తమ్ముడు అనిల్ రెడ్డి చక్రం తిప్పేలా జగన్ కొత్త ఇసుక పాలసీకి రూపకల్పన చేశారని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త సింగిల్ విండో పాలసీ రాష్ట్రంలో నవంబరు 15 నుంచి అమల్లోకి రానుందన్నారు. గత నాలుగున్నరేళ్లుగా దాదాపు 130 మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు పనిలేక ఆకలి బాధతో మరణించారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు దసరా కానుకగా ఒక్కో యూనిట్‌పై రూ.1.15 భారం వేయబోతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ట్రూఅప్ పేరుతో రూ.7,200 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ముందు ఉంచారని చెప్పారు. ప్రజలపై ఇప్పటికే రూ.64,388 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని వివిధ రూపాల్లో మోపారని పేర్కొన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రజల్లోకి వస్తున్నారంటే ముఖ్యమంత్రి, మంత్రులకు మతి చలించిందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుంటే నివారణకు సిఎం వైఎస్ జగన్ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహించారు. రైతుల విషయంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

హైకోర్టు జడ్జీలుగా 13 మంది పేర్లు

- సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదన

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో జడ్జీలుగా పదోన్నతి కల్పించేందుకు గానూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం 13 మంది అడ్వకేట్ల పేర్లను ప్రతిపాదించింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కృష్ణ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు ఈ కొలీజియంలో ఉన్నారు. అడ్వకేట్లు ఎన్ ఉన్నికృష్ణన్ నాయర్, కౌశిక్ గోస్వామి లను గౌహతి హైకోర్టు జడ్జిలుగా ప్రతిపాదించారు. అలాగే, సిద్ధార్థ షా, అలోక్ మహ్రాలను ఉత్తరాఖండ్ హైకోర్టు జడ్జీలుగా, అడ్వకేట్లు హర్మీత్ సింగ్ గ్రేవాల్, దీపేందర్ సింగ్ నల్వా, సుమీత్ గోయెల్, సుదీప్తి శర్మ, కీర్తి సింగ్‌లను పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు జడ్జీలుగా, అడ్వకేట్లు వినయ్ సరఫ్, వివేక్ జైన్, ఆశిశ్ శ్రోతి, అమిత్ సేథ్‌లను మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జీలుగా నియమించాలని కొలీజియం ప్రతిపాదించింది.

పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ దాడులను ఆపండి

- ఐరాస భద్రతా మండలిలో తీర్మానం
- అమెరికా తిరస్కృతి

న్యూయార్క్: పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులను ఆపాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో రష్యా ప్రతిపాదించిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది.

భద్రతా మండలిలోని 15 దేశాలకు గాను 14 దేశాలు దీనికి అనుకూలంగా ఓటు చేయగా, అమెరికా తనకున్న వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాన్ని అడ్డుకుంది. అమెరికా చర్యపై చైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికా మిత్రపక్షాలైన జపాన్, ఫ్రాన్స్ కూడా ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయడంతో అమెరికా ఈ విషయంలో ఒంటరిపాటైంది.

ఇదీ ప్రజా ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

ఇతర కులాల వారిని రానీయనివారు ఈ తరహా ప్రచారంతో మతవిద్వేషాలు రగిలించే పనిచేస్తున్నారని విమర్శించారు. వారికి ప్రజల్లో విలువ లేదని, ఉన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని, అటువంటి వాటికి ప్రభుత్వమూ చెక్‌పెట్టాలని కోరారు. కులగణన, జనగణన కలిపి చేయాలని సూచించారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే దీన్ని వాయిదా వేసుకుంటూ వస్తోందని అన్నారు. మహిళా బిల్లును 2029లో అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అసైన్డ్ భూముల వివరాలు తీయాలని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వేలో ఈ విషయాలన్నీ వెలుగులోకి వచ్చినా ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. కొత్తగా ఇస్తున్న పట్టాలు బిఫారమా, ఒరిజినల్ పట్టాలా అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలు పంచేందుకు సిద్ధంగా ఉందని గుర్తించారని, అర్హులందరికీ ఆ భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా ప్రణాళికలో ముఖ్యాంశాలు

1 కరెంటు యూనిట్ రూపాయికే ఇవ్వడంతోపాటు పేదలకు 300 యూనిట్లు ఉచితం. స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూఅప్ ఛార్జీల రద్దు

2. రూ.400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోలు, డీజిల్, ఇసుక ఉచితం

3. తలకు పదికేజీల ఉచిత బియ్యం, పప్పు నూనెల సరఫరా, నిత్యావసర ధరల తగ్గింపు

4. అందరికీ సంక్షేమం, పెన్షన్లు, రేషన్‌కార్డులు అన్నిరకాల పెన్షన్లు రూ.5000, పేద మహిళలకు ప్రత్యేక సాయం

5. రెండు సెంట్ల ఇల్లు, రూ.5 లక్షల ఆర్థికసాయం, నివాసిత ప్రాంతాల్లోనే ఇళ్లకు పట్టాలు, కొత్తకాలనీలకు అన్ని సౌకర్యాలు, చెత్తపన్ను, డ్రెయినేజీ ఛార్జీలు రద్దు, ఇంటిపన్ను తగ్గింపు

6. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతిలోనే రాజధాని

7. 40 వేల టీచర్‌పోస్టులకు మెగా డిఎస్‌సి, 2.50 లక్షల ప్రభుత్వ ఖాళీలు భర్తీ, నిరుద్యోగభృతి నెలకు రూ.5000

8. ఒపిఎస్ పునరుద్ధరణ, ప్రైవేటు ఉపాధ్యాయులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్.

9. భూమిలేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు రెండెకరాల భూమి, సేకరించిన భూముల్లో పరిశ్రమలు, లేదంటే రైతులకు వాపస్.

10. అసలు పట్టాదారుకే అసైన్డ్ భూములపై హక్కులు, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు

11. గ్రామీణ ఉపాధి 200 రోజులు, రోజు వేతనం రూ.600. పట్టణ ఉపాధి గ్యారంటీ చట్టం, సమానపనికి సమాన వేతనం.

12. చిన్న పరిశ్రమలు, వ్యాపారులకు రక్షణ, మెగా మాల్స్‌పై ఆంక్షలు, రాష్ట్రంలో ఐటి, ఫార్మా, టెక్స్‌టైల్, జూట్, పేపర్, అగ్రి, సినీరంగం, పరిశ్రమల అభివృద్ధి. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు.

13. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు. సమగ్ర సంక్షేమ చట్టం, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్. ప్రభుత్వ ఉద్యోగులుగా స్కీం వర్కర్లు.

14. అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, విద్యార్థులకు పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్, కిడ్నీ పేషెంట్లకు మందులు, పెన్షన్, సుజాతారావు కమిటీ సిఫార్సులు అమలు.

15. రైతులకు గిట్టుబాటు ధర. ప్రతి ఎకరాకు సాగునీరు, మోటార్లకు ఉచిత విద్యుత్, ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డు, రుణం గ్యారంటీ, స్వామినాథన్, జయతీఘోష్, రాధాకృష్ణ కమిషన్ సిఫార్సుల అమలు

16. 2024 నుండే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు, మహిళల రక్షణ, అభివృద్ధికి కమిషన్. మద్యపానంపై నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన.

17. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, అటవీ సంరక్షణ చట్టసవరణ రద్దు. పోడు భూములకు పట్టాలు, ప్రత్యేక డిఎస్‌సి, ఏజెన్సీలో నాన్ షెడ్యూలు గిరిజన గ్రామాలు జిఓ 3 అమలు.

18. సామాజిక న్యాయం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, కులగణన, వివక్షపై కఠినచర్యలు, సబ్‌ప్లాను అమలు, దళితులకు రక్షణ, జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సుల అమలు, డప్పు, చర్మకారులందరికీ పెన్షన్లు.

19. వెనుకబడిన ప్రాంతాలకు రూ.లక్ష కోట్లతో ప్యాకేజీ, నిర్ణీత కాలపరిమితిలో వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులు పూర్తి. నిర్వాసితుల పునరావాసానికి ప్రాధాన్యత. 2013 భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు.

20. పరిశుభ్రమైన వాతావరణం, సముద్రతీర సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ. కాలుష్యరహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్.

21. మైనార్టీల హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్లు, మత సామరస్యం, సచార్, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సుల అమలు.

22. వృత్తులకు రక్షణ, ఆధునిక పరికరాల సరఫరా. బిసిలకు సబ్‌ప్లాన్, ప్రత్యేక నిధులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్లకు నిధులు, స్వయం ఉపాధికి రుణాలు, సబ్సిడీలు.

23. వికలాంగుల చట్టానికి రూల్స్ నోటిఫై. ఇతర పెన్షన్లతో సంబంధం లేకుండా నెలావారీ భృతి రూ.6000.

24.పాసింజర్ రైళ్ల పునరుద్ధరణ, జనరల్ బోగీల పెంపు, ఆర్‌టిసి బస్సుల్లో విద్యార్థులు, మహిళలు, వికలాంగులకు ఉచిత ప్రయాణం.

25. స్థానిక సంస్థలకు నిధులు, విధులు, స్థానిక సంస్థల పరిధిలోకి సచివాలయాలు. గ్రామీణాభివృద్ధికి నిధులు.

26. ప్రభుత్వ రంగం బలోపేతం, సహకార వ్యవస్థ పటిష్టం. డెయిరీ, చక్కెర మిల్లుల పున:ప్రారంభం.

27. కర్నూలుకు హైకోర్టు, విజయవాడ, విశాఖకు బెంచీలు. సత్వరన్యాయం, యువ న్యాయవాదులకు ప్రోత్సాహం. అవినీతిపై ప్రజా యుద్ధం, పకడ్బందీగా చట్టాల అమలు, బడా కార్పొరేట్లపై పన్ను, బ్యాంకు బకాయిలు వసూళ్లు.

28. పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఉచిత వృద్ధాశ్రమాలు, శ్రామిక మహిళల పిల్లలకు ఉచిత డేకేర్ సెంటర్లు. జానపద, వృద్ధ కళాకారులకు భృతి

29. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, రాజ్యాంగానికి లోబడి సుపరిపాలన, ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల బాండ్లు రద్దు, కార్పొరేట్ నిధులకు చెక్, పౌరుల వ్యక్తిగత గోప్యానికి భద్రత.

30. ప్రజాస్వామ్య, లౌకిక సంస్కృతి పరిరక్షణ, భారతీయ ఉత్తమ సంప్రదాయాలు, స్వాతంత్ర్యోద్యమ వారసత్వం కొనసాగింపు.

కార్పొరేట్ల కోసమే విద్యుత్ సంస్కరణలు

- డేటా సేకరణ కోసమే స్మార్ట్ మీటర్లు
- ప్రీపెయిడ్‌తో వ్యవసాయ పంపుసెట్లకు ఆటంకం
- సిపిఎం రాష్ట్ర సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే విద్యుత్ సంస్కణలను అమలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా వినియోగదారులు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వస్తు సామగ్రి డేటాను సేకరించి ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడతారని తెలిపారు. 'విద్యుత్ సంస్కరణలు - ప్రజలపై భారాలు' అన్న అంశంపై విజయనగరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం చేయాలంటూ సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత తులసీదాస్ మాట్లాడుతూ.. అప్పుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తలొగ్గారని అన్నారు. ఇందులో భాగంగానే విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు వైసిపి ప్రభుత్వం పూనుకుంటోందని తెలిపారు. దీనివల్ల గృహ వినియోగదారులపై ఆర్థిక భారం, ప్రయివేటు పరిశ్రమల మనుగడకు ఇబ్బంది కలగడమే కాకుండా పాలిటెక్నిక్, ఐటిఐ వంటి అర్హతలతో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్ ఉద్యోగాలు గల్లంతవుతాయని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ రంగంలో ఉద్యోగ, ఉపాధి కల్పన, రిజర్వేషన్లు అమలు వంటివి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. విద్యుత్ రంగంలోనూ ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తే సెల్‌ఫోన్ల రీఛార్జ్ మాదిరిగా నిర్ధేశించిన యూనిట్ల వినియోగం తరువాత ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బంది పడడంతోపాటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు అనంతరం రైతుల చేతిలో బిల్లులు పెట్టే పరిస్థితి ఏర్పడబోతుందని తెలిపారు. సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం సిపిఎం చేపట్టిన విద్యుత్ ఉద్యమంలో ప్రజలు తమ ప్రాణాలను సైతం ఫణ్ణంగా పెట్టి పోరాడారని గుర్తుచేశారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కాల్పులు జరిపి ప్రాణాలు తీసిందని, చివరకు విద్యుత్ భారాల పెంపును విరమించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు ఆ తరువాత వైఎస్ రాజశేఖరరెడ్డి సాహసం చేయలేకపోయారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ట్రూఅప్, ఎఫ్‌పిపిసి సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడంతోపాటు మొత్తం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనివల్ల ఫెర్రోఎల్లాయీస్ తదితర పరిశ్రమలు ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోయాయని చెప్పారు. ఈ విధానాన్ని సిపిఎంతోపాటు సిఐటియు వ్యతిరేకిస్తోందన్నారు. ప్రజలను, కార్మికవర్గాన్ని చైతన్యపరచి మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహా చండీదేవిగా దుర్గమ్మ

- నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం

ప్రజాశక్తి - యంత్రాంగం

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు దుర్గమ్మను జగన్మాత చండీదేవి రూపంలో అలంకరించారు. దాదాపుగా 70 సంవత్సరాల తరువాత ఈ రూపంలో దుర్గమ్మను అలంకరించడంతో అమ్మవారిని చూసేందుకు యాత్రికులు పెద్దఎత్తున తరలివచ్చారు. సుమారు లక్ష మందికి పైగా యాత్రికులు దుర్గమ్మను దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు అంచనా వేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దుర్గమ్మకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. నేడు సరస్వతీదేవి రూపంలో దుర్గమ్మను అలంకరించనున్నారు.

మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడు

శ్రీవారి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మలయప్పస్వామివారిని మోహినీ రూపంలో ఊరేగించారు. గజరాజులు ముందు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకీసేవ కోలాహలంగా జరిగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి 6.30 గంటలకు గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామివారిని ఊరేగించారు. అస్సాంకు చెందిన బిహు, మహారాష్ట్రకు చెందిన సోంగి ముఖోటా, శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల మోహినీ అవతార నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రాజమండ్రికి చెందిన పి.సుమన్ డ్రమ్స్ విన్యాసాలు అలరించాయి. మొత్తం 12 కళాబృందాల్లో 313 మంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలిచ్చారు.

కనీస వేతనాలను నిర్ధారించిన కార్మికశాఖ

కనిష్టం రూ.11,405 • గరిష్టం రూ.13,062

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి 31 వరకు అమలు చేయాల్సిన కనీస వేతనాలను నిర్ధారిస్తూ అన్ని జిల్లాల కార్మిక శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఎం.వి. శేషగిరిబాబు రెండు రోజుల క్రితం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి స్వల్ప పెరుగుదలలో కనీస వేతనాలను నిర్ధారిస్తూ ఈ ఆదేశాలు ఇస్తుంటారని కార్మికశాఖ అధికారులు వెల్లడించారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్న కార్మిక సంఘాల డిమాండ్ ఇంతవరకు అమలు నోచుకోవడంలేదు. సమాన పనికి సమాన వేతనం ప్రకారం కనీసవేతనాలు రూ.26 వేలు ఇవ్వాలన్న సుప్రీం తీర్పును కూడా ఇంత వరకు ప్రభుత్వం అమలు చేయడం లేదు. కార్మిక శాఖ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులు ప్రకారం కనీస వేతనాల్లో కనిష్టం రూ. 11,405 ఉండగా, గరిష్టంగా రూ.13,062 మాత్రమే ఉన్నాయి. జోన్-1లో రాష్ట్రంలో అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రేడ్-1 మున్సిపాలిటీలు, జోన్-2లో గ్రేడ్2 మునిసిపాలిటీలు, నగరపంచాయతీలు ఉంటాయి. కనీస వేతనాల అమలుకు సంబంధించి కార్మిక శాఖ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు,కార్మిక శాఖ అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కనీస వేతనాల వివరాలు	జోన్1	జోన్2
మేనేజరు,సేల్స్ మేనేజర్, సెక్యూరిటీ ఆఫీసర్, కంప్యూటర్ ప్రొగ్రామర్ :	రూ. 13,262	రూ. 13,062
అసిస్టెంట్ మేనేజర్, ఎకౌంట్స్ సూపర్‌వైజర్, పర్చేజర్:	రూ. 12,427	రూ. 12,007
సేల్స్‌మెన్, సేల్స్ రిప్రజెంటేటివ్, బిల్లు రైటర్, క్యాషియర్, ట్రేడ్స్‌మెన్:	రూ. 12,225	రూ. 12,007
క్లర్క్, గోడౌన్ ఇన్‌ఛార్జి, ఎక్కౌంట్స్ అసిస్టెంట్స్, టైపిస్టు, రిసెప్షనిస్టు:	రూ. 11,807	రూ. 11,591
కళగరి,వేమెన్, మిల్క్ వెండర్స్ :	రూ. 11,591	రూ. 11,462
బైస్కిల్ ఫిట్టర్, అటెండర్, ఫ్యూన్, వాటర్‌బాయ్, షాప్ బాయ్,హెల్పర్ :	రూ. 11,405	రూ. 11,075
కంప్యూటర్ ఆపరేటర్ :	రూ. 11,591	రూ. 11,462
సెక్యూరిటీ గార్డు :	రూ. 11,405	రూ. 11,075
టైప్ రైటింగ్ ఇన్‌స్ట్రక్టర్ :	రూ. 11,225	రూ. 12,007
వాణిజ్య సంస్థలు :		
మేనేజర్,ఫీల్డ్ ఆఫీసర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్, సెక్యూరిటీ ఆఫీసర్:	రూ. 13,262	రూ. 12,843
ఎకౌంటెంట్, అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, సూపర్ వైజర్ :	రూ. 12,427	రూ. 12,225
సేల్స్‌మెన్, స్టెనో గ్రాఫర్, రిసెప్షనిస్టు, ఆక్షన్ బైడర్, ట్రేడ్‌మెన్ :	రూ. 12,225	రూ. 12,007
క్లర్కు, టైపిస్టు, క్లర్కు కం టైపిస్టు, గోడోన్ ఇన్‌ఛార్జి, లైన్‌మెన్:	రూ. 11,807	రూ. 11,591
వేమెన్, కలగిరి :	రూ. 11,591	రూ. 11,462
ఫీన్,వాచ్‌మెన్,అటెండర్, వాటర్‌బాయ్, హెల్పర్, సెక్యూరిటీ గార్డు :	రూ. 11,405	రూ. 11,075
కంప్యూటర్ ఆపరేటర్ :	రూ. 11,591	రూ. 11,462

- పండగ సీజన్ నేపథ్యంలో అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023 ఆన్ లైన్ షాపింగ్ వినియోగదారులకు అమేజాన్ పే 'రుపే క్రెడిట్ కార్డ్స్‌పై ఈఎంఐ'ని పరిచయం చేసింది. ఎనిమిది బ్యాంక్‌లు జారీ చేసే రూపే క్రెడిట్ కార్డులపై ఈ సౌలభ్యాన్ని అందిస్తున్నామని అమెజాన్ పే ఇండియా క్రెడిట్ అండ్ లెండింగ్ డైరెక్టర్ మయాంక్ జైన్ తెలిపారు.

సంపాదకీయం


పెన్షన్ హక్కు

ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన అంశాల్లో పెన్షన్ కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దుతున్న నూతన పెన్షన్ విధానాన్ని దేశవ్యాప్తంగా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రశాంతంగా గడవ వలసిన జీవితాలు ఈ విధానంతో ప్రశ్నార్థకంగా మారుతుండటమే దీనికి కారణం. శక్తియుక్తులన్నీ ఉద్యోగులుగా ఖర్చు చేసిన తరువాత, మిగిలిన జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి ఉద్దేశించిందే పెన్షన్! అయితే, అటువంటి పరిస్థితి నిజంగా ఉందా అంటే లేదు అన్నదే సమాధానం. అనేక రంగాల మాదిరే ఈ విషయంలోనూ మనదేశానిది అథమస్థానమే.అమెరికాకు చెందిన కన్సల్టింగ్ కంపెనీ మెర్సర్, స్వచ్ఛంద సంస్థ సిఎఫ్ఎ ఇన్‌స్టిట్యూట్ కలిసి సంయుక్తంగా విడుదల చేసిన తాజా ప్రపంచ పెన్షన్ సూచీ (2023)లో భారతదేశ స్థానం చివరి నుండి మూడవది! మొత్తం 47 దేశాల్లో ఆ సంస్థ సర్వే నిర్వహించగా భారత్ 45వ స్థానంలో నిలిచింది. 2022 లో 44 దేశాలకుగాను మన దేశం 41 వ స్థానంలో నిలిచింది. అంటే గత ఏడాదితో పోల్చినా మన స్థానం మరింత దిగజారిందన్నమాట. ఇదీ సీనియర్ సిటిజన్లకు మనం ఇస్తున్న గౌరవం! ఈ వాస్తవాన్ని గుర్తించి, మెరుగైన విధానాన్ని రూపొందించడానికి మన పాలకులు సిద్ధపడకపోవడమే విచారకరం. ప్రపంచ ఆకలి సూచీ రిపోర్టును తిరస్కరించినట్టే దీనిని కూడా మోడీ ప్రభుత్వం తిరస్కరించింది. 2021లో పెన్షన్ సూచీలో భారత్ చివరిస్థానంలో నిలవడంతో పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చింది. దీనిపై వివరణ ఇచ్చిన ప్రభుత్వం ఆ సూచికలో విశ్వసనీయ సమాచారం లేదని, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోలేదని ప్రకటించింది. ఆ తరువాతైనా పెన్షన్ విధానంలో మెరుగైన మార్పులు తీసుకువచ్చిందా అంటే అదీ లేదు. ఏటికేడాది దిగదిడుపే!

నిజానికి, మెర్సర్-సిఎఫ్ఎ ఇన్‌స్టిట్యూట్ గత పదిహేను సంవత్సరాలుగా విడుదల చేస్తున్న గ్లోబల్ పెన్షన్ ఇండెక్స్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది.తాజా సర్వేను 64 శాతం ప్రపంచ జనాభాకు ప్రాతినిధ్యం వహించేలా 47 దేశాల్లో ఈ సర్వే జరిగింది. ఆ దేశాల్లోని పెన్షన్ విధానాలను సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు, 50 అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సర్వేలో 85 పాయింట్లతో నెదర్లాండ్స్ మొట్టమొదటి స్థానంలో నిలవగా, 83.5 పాయింట్లతో ఐస్‌ల్యాండ్ రెండవ స్థానంలో, 81.3 పాయింట్లతో డెన్మార్క్ మూడవ స్థానంలో నిలిచాయి. 45వ స్థానంలో నిలిచిన భారత్‌కు 45.9 పాయింట్లు దక్కగా, 42.3 పాయింట్లతో అర్జెంటీనా చిట్టచివరన నిలిచింది. అమెరికాతో పాటు మధ్యస్థంగా ఉన్న అనేక దేశాలు తీసుకురావాల్సిన మార్పులను పేర్కొన్న నివేదిక, చైనా, కొరియా, సింగపూర్, జపాన్ వంటి దేశాలు మెరుగైన విధానాలను అమలు చేస్తున్నాయని తెలిపింది. అదే సమయంలో భారత్ పనితీరుపై అది పెదవి విరిచింది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా దుర్భరమౌతున్న బతుకులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన ప్రమాణాల్లో వస్తున్న మార్పులు, అంతకంతకు భారమౌతున్న వైద్య ఖర్చుల తీరును ప్రస్తావించిన నివేదిక వీటిని తట్టుకునే విధంగా పెన్షన్ విధానాలను రూపొందించాలని ప్రపంచ దేశాలకు సూచించింది.

మెరుగైన పెన్షన్ విధానం కోసం దేశంలోనూ, ప్రత్యేకించి మన రాష్ట్రంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సాగిస్తున్న పోరాటాన్ని ఈ నేపథ్యంలోనే చూడాలి. ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ఉద్యోగ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవితం కోసం పాత పెన్షన్ విధానం కావాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి భిన్నంగా కంట్రిబ్యూషన్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్‌ను వీరు తిరస్కరిస్తున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమలు చేస్తుండగా, మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సాధ్యం కాదని, ఖజానాపై పెను భారం పడుతుందని చెబుతుండటం విచిత్రం! ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ మొండి వైఖరికి నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమైనాయి. క్షేత్రస్థాయికి పోరాటాన్ని తీసుకుపోవడంలో భాగంగా జిల్లా, మండల స్థాయిల్లోనూ దీక్షలు చేపట్టనున్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న పార్టీకే రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని ఉపాధ్యాయ నేతలు ఇచ్చిన పిలుపు అత్యంత సముచితమైనది. గౌరవప్రదమైన పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదు. ఉద్యోగుల హక్కు! అని నినదిస్తూ ఇటీవల ఢిల్లీలో భారీ ర్యాలీ జరిగింది. రాష్ట్రంలోనూ అంచెలంచెలుగా ఈ పోరాటం విస్తృతమౌతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలి.

మహనీయుని మాట



విప్లవం మానవాళికి అవశ్యకమైన హక్కు స్వాతంత్ర్యం మానవులందరి శాశ్వతమైన జన్మహక్కు, శ్రమ సమాజాన్ని పోషించే నిజమైన సాధనం.

- హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ,
భారతీయ ఆంగ్ల కవి, నాటకకర్త, నటుడు, సంగీతకారుడు.

విశ్లేషణ

చిన్న పరిశ్రమలపై విద్యుత్ భారం

రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. చిన్న పరిశ్రమలు ఈ దశాబ్దంలో ఎన్నడూ లేనంత కష్టాల్లో కూరుకుపోయాయి. అందుకు ముఖ్యంగా మూడు కారణాలు ఉన్నాయి. ఒకటి కేంద్ర బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ ఆధిపత్య అనుకూల విధానాలు, రెండు పెరిగిన ముడిపదార్థాల ధరలు, మూడు కరోనా మహమ్మారి. వీటికి తోడు మన రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ చార్జీలు, విద్యుత్ సుంకాలు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లు-2020 చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, వ్యవసాయదారులకు శాపంగా ఉంది. ఈ వినాశకర విధానాన్ని దేశంలో అందరికంటే ముందుగా మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వ్యవసాయం అడుగంటిపోతున్నది. రైతులు పంటలు సాగు చేయడానికి తీవ్ర విముఖత చూపుతున్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాల సాగుభూమి బీడుగా మారింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ నత్తతో పోటీ పడుతున్నాయి. చేనేత, బీడీ లాంటి కుటీర పరిశ్రమలు విదేశీ, స్వదేశీ కార్పొరేట్ల పోటీకి తట్టుకోలేక క్షీణించిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల సమస్యలను పరిష్కరించి యువతకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలే వీటి ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చే విధానాలను అమలుచేస్తున్నాయి.




వి. రాంభూపాల్

పరిశ్రమలపై విద్యుత్ భారం

ఏ నెలలో ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత బిల్లు మరుసటి నెలలో చెల్లించడం ఇప్పటివరకు అమలవుతున్న విధానం. కానీ వైసిపి ప్రభుత్వం గత దశాబ్దం కింద వాడిన కరెంటుకు చెల్లించిన బిల్లుకు వ్యత్యాసం వచ్చిందని ఇప్పుడు చెల్లించమంటోంది. దీనికి 'ట్రూ అప్ చార్జీ' అని ముద్దు పేరు పెట్టారు. విద్యుత్ తయారీకి వాడిన ఇంధనం ధరలు మారుతుంటాయని 'ఇంధన సర్దుబాటు చార్జీ' వంటి రకరకాల చార్జీలు వినియోగదారులపై వేస్తున్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల మీద గత సంవత్సరంతో పోలిస్తే 72 శాతం ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు ఈ సంవత్సరంలో పెరిగాయి. లెవీ యూనిట్‌కు 85 పైసలు, విద్యుత్ సుంకం యూనిట్‌కు ఆరు పైసల నుండి ఏకంగా ఒక్క రూపాయికి పెంచారు. వీటివల్ల ఏడు రూపాయల అరవై పైసలు వున్న యూనిట్ చార్జీ 9 రూపాయలకు పెరిగింది. 2019కి ముందు యూనిట్ రూ.4.95 వుండేది. పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ప్రతి నెలా సుమారుగా రూ. 4.18 లక్షల అదనపు భారం పడుతుంది. ఇంత మొత్తాన్ని ఈ పరిశ్రమలు భరించే స్థితిలో లేవు. ఇప్పటికే 20 శాతం పరిశ్రమలు మూతపడినట్లు ముఖ్యంగా ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమల్లో ఉత్పత్తి వ్యయంలో 60 శాతం వరకు విద్యుత్తే ముడిసరుకుగా ఉంటుంది. అందవల్ల ఈ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతకు సిద్ధమయ్యాయి. ఇంజినీరింగ్, స్పిన్నింగ్ మిల్లుల్లో ఉత్పత్తి వ్యయంలో 20 నుండి 40 శాతం విద్యుత్ వాడకం జరుగుతుంది. ఇలాంటి అనేక పరిశ్రమలు విద్యుత్ భారాలను భరించలేక దివాళా అంచులకు చేరాయి.

పరిశ్రమలు తమ ఉత్పత్తి ఒప్పందాలను ముందస్తుగా చేసుకుంటాయి. కానీ ఇలా ప్రతి నెలా ఏదోక పేరుతో విద్యుత్ చార్జీలు పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చు పెరుగుతుంది. ఈ భారాన్ని పరిశ్రమలు భరించాల్సి వస్తుంది. 5 నుండి 10 శాతం లోపుగా లాభాలు వచ్చే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయి. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో ఉత్పత్తి ఖర్చు ఎక్కువ కావడంవల్ల ఈ పరిశ్రమలకు ఆర్డర్లు కూడా తగ్గిపోతున్నాయి. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దివాళా తీయడం, లేదా మూసివేయడం పెరుగుతుంది. ఉపాధి కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతుంది. ఉన్న నిరుద్యోగానికి వీరు అదనపు నిరుద్యోగులుగా చేరుతున్నారు.



పరిశ్రమలు తమ ఉత్పత్తి ఒప్పందాలను ముందస్తుగా చేసుకుంటాయి. కానీ ఇలా ప్రతి నెలా ఏదోక పేరుతో విద్యుత్ చార్జీలు పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చు పెరుగుతుంది. ఈ భారాన్ని పరిశ్రమలు భరించాల్సి వస్తుంది. 5 నుండి 10 శాతం లోపుగా లాభాలు వచ్చే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయి. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో ఉత్పత్తి ఖర్చు ఎక్కువ కావడంవల్ల ఈ పరిశ్రమలకు ఆర్డర్లు కూడా తగ్గిపోతున్నాయి. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దివాళా తీయడం, లేదా మూసివేయడం పెరుగుతుంది. ఉపాధి కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతుంది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రాధాన్యత

దేశంలో 6.33 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) లు ఉన్నాయి. ఇందులో 11 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. దేశ జాతీయోత్పత్తిలో వీటి వాటా 30 శాతం, పారిశ్రామిక ఉత్పత్తిలో 45 శాతం, విదేశీ ఎగుమతుల్లో ఈ పరిశ్రమల ఉత్పత్తులు 48 శాతంగా ఉన్నాయి. రాష్ట్రంలో 55,761 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు 13,360.15 కోట్ల పెట్టుబడులతో 2,27,027 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. రాష్ట్ర ఆదాయంలో వీటి పాత్ర గణనీయంగా ఉన్నది. 2023-24 నాటికి 1,50,000 ఎంఎస్‌ఎంఈ లు ఏర్పాటు చేసి 7,50,000 మందికి ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి 2023 జులైలో ప్రకటించారు. ఇంతటి లక్ష్యం నిజంగా నెరవేరలంటే ఈ పరిశ్రమల స్థాపనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. కాని ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను 1,25,000లకు పెంచాలని సుమారు ఐదు సంవత్సరాల క్రితం లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటికీ ఉత్పత్తి చేస్తున్న పరిశ్రమలు కేవలం 55,761 మాత్రమేనని 2023-24 ఆంధ్రప్రదేశ్ సోషియో ఎకనామిక్ సర్వే నివేదికలో ప్రభుత్వమే ప్రకటించింది. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో పాలకులు ఆలోచించడంలేదు. తాము అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు, పెంచుతున్న విద్యుత్ చార్జీలు, విద్యుత్ సుంకాలు చిన్న పరిశ్రమల ఉనికిని దెబ్బతీస్తున్న విషయాన్ని గుర్తించడానికి నిరాకరిస్తున్నారు.

2019-20 నాటికి రాష్ట్రంలో రూ. 54,236.53 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి చేస్తున్న 109 భారీ పరిశ్రమల్లో 71,856 మంది మాత్రమే ఉపాధి పొందుతుండగా, రూ. 13,360.15 కోట్ల పెట్టుబడితో నడుస్తున్న 55,761 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో 2లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇలాంటి పరిశ్రమలు దివాళా తీస్తే యువతకు ఉపాధి తీవ్ర సమస్యగా మారుతుంది. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, బెంగళూరు-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్ -బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ల పేర్లతో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం యువతకు ఎండమావులను చూపుతున్నాయి. ఈ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు 'వైఎస్సార్ ఎ.పి ఒన్', 'వైఎస్సార్ నవోదయం స్కీమ్', 'వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ పాలసీ' ఇలా రకరకాల పేర్లు ప్రకటించింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెట్టాలంటే అనేక రకాల ప్రోత్సాహకాలు ఇవ్వాలి. కానీ వైసిపి ప్రభుత్వం గతంలో ఎంఎస్‌ఎంఈ లకు ప్రకటించిన ప్రోత్సాహకాలే అమలు చేయడంలేదని ఈ సంస్థల ఛాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ లెక్కలు ప్రకటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.200 కోట్లు, స్పిన్నింగ్ టైక్స్‌టైల్ పరిశ్రమలకు రూ.200 కోట్లు, ఇతర పరిశ్రమలకు రూ.1400 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఒకవైపు విద్యుత్ భారాలు, రెండోవైపు ప్రోత్సహకాల బకాయిలు. వీటికి తోడు కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు. ఈ ముప్పేట దాడితో ఈ చిన్న పరిశ్రమలు విలవిలలాడుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ విధానలకు రాష్ట్రం వత్తాసు

కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్నది. అన్ని రంగాల్లో వాటికి ఎదురులేని గుత్తాధిపత్యాన్ని కల్పించే నిర్ణయాలను అమలు చేస్తున్నది. ఈ కంపెనీలకు గత తొమ్మిది సంవత్సరాల్లో రూ.17.46 లక్షల కోట్లను వివిధ రకాల పేర్లతో రద్దు చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలను అతి చౌకగా అప్పగించడం, వాటిని దివాళా తీయించే చర్యలను చేపట్టడం, సహజ వనరులను లూటీ చేసేందుకు వీలుగా చట్టాలను మార్చేయడం జరుగుతున్నది. రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలోని అంశాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తున్నది. వీటిని ప్రతిఘటించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అదే విధానాలను పార్లమెంట్‌లో బలపరుస్తున్నది. రాష్ట్రంలో అమలు చేయడానికి సిద్ధమవుతున్నది. గౌతం అదానీ రహస్యంగా ముఖ్యమంత్రిని కలిసాడు. ఓడరేవులు, సముద్ర నిక్షేపాలు, గనులు అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నా ముఖ్యమంత్రి స్పందించడంలేదు.

విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సు ముగిసి ఏడు నెలలు పూర్తయింది. అక్కడ చేసుకున్న ఒప్పందాల్లో ఇప్పటివరకు ఎన్ని అమలులోకి వచ్చాయో చెప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. 25 దేశాలకు చెందిన 30 పెద్ద కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు వచ్చారని, 378 ఒప్పందాలు జరిగాయని, వీటి విలువ రూ.13.42 లక్షల కోట్లని వీటి వల్ల ఆరు లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఈ ఒప్పందాల్లో రూ.9,57,112 కోట్ల పెట్టుబడి పునరుత్పాదక శక్తి అంటే సోలార్, గాలి మరల విద్యుత్ ఉత్పత్తి కోసం చేసుకోబడ్డాయి. మన రాష్ట్రంలో ఈ రంగంలోకి పెద్ద ఎత్తున కార్పొరేట్ కంపెనీలు వస్తున్నాయి. వీటిల్లో అతి తక్కువ ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. చౌకగా కరెంట్‌ను ఉత్పత్తి చేసి గృహ వినియోగదారులకు, వ్యవసాయదారులకు, చిన్న పరిశ్రమలకు ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి అన్ని ఏర్పాట్లు ఈ కంపెనీలు చేసుకుంటున్నాయి. ఇందులో భాగమే గృహాలకు స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానాలు వ్యవసాయంతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్ర సంక్షోభాల్లోకి నెడుతాయి. వీటిని ప్రతిఘటించాల్సిన నేటి ప్రధాన ప్రతిపక్షం కేంద్రాన్నే బలపరుస్తున్నది. టిడిపి అధికారంలో ఉన్న 1999లో ప్రపంచబ్యాంకు నుండి 100 కోట్ల డాలర్ల అప్పు తీసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (ఎంపిఎస్‌ఇబి)ని ముక్కలు చేశారు. ఇప్పటికీ అదే విధానాలను సమర్థించుకుంటున్నారు.

కరోనా మహమ్మారి వల్ల దేశంలో 37 శాతం చిన్న, మధ్యతరహా పరిశ్రమలు శాశ్వతంగా మూతబడ్డాయి. మన రాష్ట్రంలో కూడా వేల పరిశ్రమలు ఉత్పత్తి తగ్గించుకోవడమో, శాశ్వతంగా మూతవేయడమో జరిగింది. విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే చిన్న పరిశ్రమలు ఉత్పత్తి చేయలేని స్థితికి చేరుకుంటాయి. తద్వారా ఉపాధి సమస్య తీవ్రమవుతుంది. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే విద్యుత్ భారాల నుండి వ్యవసాయాన్ని, చిన్న పరిశ్రమలను రక్షించుకోవాలి.

(రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

సందర్భం



అందరి జీవితాలతో ముడిపడినది గణాంకశాస్త్రం

విశ్వ మానవాళి దైనందిన జీవన విధానంలో గణాంక శాస్త్రానికి ప్రాధాన్యం ఉన్నది. గణాంకాలు లేకుండా వ్యక్తిగత జీవితం, కుటుంబం, కార్యాలయం, పరిశ్రమలు, ప్రభుత్వ వ్యవస్థల్లో ఏ పనీ జరగదు. ఆరోగ్య పరిరక్షణ, న్యాయశాస్త్రం, ఆర్థికశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, వైజ్ఞానిక శాస్త్రం, గణిత శాస్త్రం, సామాజిక శాస్త్రం, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, ఇంజనీరింగ్, మెడిసిన్, విద్య లాంటి అన్ని రంగాల్లో సంఖ్యలతో అధ్యయనం ద్వారా గణాంకశాస్త్రం ప్రధానమైందిగా గుర్తించబడింది. గణాంక శాస్త్రానికి ప్రాణాధారంగా డేటా ఉపయోగపడుతున్నది. వాస్తవాలు స్పష్టంగా, స్థిరంగా ఉంటాయి. గణాంకశాస్త్రం మాత్రం సులభంగా మారే స్వభావంతో ఉంటాయి. సాధారణంగా జనాభా సర్వే నుంచి లభించే గణాంకాలతో స్పష్టమైన, అవసరమైన పథకాల రచన జరుగుతుంది. గణాంకాల్లో లోపం ఉన్నప్పుడు ఫలితం కూడా తేడాగా వస్తుందని తెలుసుకోవాలి.

ప్రపంచ గణాంకశాస్త్ర దినం

అక్టోబర్ 20న "ప్రపంచ గణాంకశాస్త్ర లేదా సంఖ్యాశాస్త్ర దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా వున్న దేశాలు తమ తమ సుస్థిరాభివృద్ధి కోసం గణాంక శాస్త్రాన్ని విరివిగా వినియోగించుకుంటాయి. పథకాల రూపకల్పన, సర్వేల సమాచారం, పథకాల అమలు శాతం, భవిష్యత్తు నిర్ణయాలు లాంటి అంశాల్లో సంఖ్యాశాస్త్ర వివరాలు ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వాలు తీసుకునే అనేక నిర్ణయాలకు పునాదిగా గణాంక వివరాలు దోహదపడతాయి. పి.సి. మహల్ నోబిస్ జన్మదినం సందర్భంగా భారత దేశవ్యాప్తంగా ప్రతి ఏట జూన్ 29న "జాతీయ గణాంకశాస్త్ర దినం" జరుపుకుంటున్నది.

గణాంకాల అధ్యయనాలతో సుస్థిర ప్రగతి

గణాంక సమాచార సేకరణ, శాస్త్రీయ అధ్యయనం, ఫలితాల విశ్లేషణ, అంతిమంగా లభించిన ఫలితాలను బట్టి సఫల దిశగా అమలులోకి తేవడం లేదా అంచనా వేయడం లాంటివి సంఖ్యాశాస్త్రం ద్వారా జరుగుతుంది. ప్రగతి తీరునే కాకుండా, వైఫల్య అంచనాలను కూడా గణాంకశాస్త్రం వివరిస్తుంది. మానవ జీవన విధానాన్ని సరళతరం చేయడానికి, నూతన ఆవిష్కరణలకు, సృజనశీల ఆలోచనలకు గణాంకశాస్త్రం ఊతం ఇస్తున్నది. భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పన, మన జీవన విధాన అంచనా, జనాభా లాభపడడం, లోటుపాట్లను గుర్తించి సరైన దిశలో కదలడం లాంటివి సంఖ్యాశాస్త్ర వినియోగంతో ఒనగూరుతాయి.

అంతర్జాతీయ సంస్థలు, యూనివర్సిటీలు, పౌర సమాజం, ఉన్నత విద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు తమ తమ పరిధిలో ప్రపంచ గణాంకశాస్త్ర దినం నిర్వహించుకుంటారు. ఖచ్చితమైన గణాంకాల అధ్యయన విశ్లేషణలతో సరైన పథకాల రచనను చేయవచ్చు. చిట్టి కొట్టు నుంచి బహుళజాతి సంస్థల వరకు గణాంకాల వినియోగం తప్పనిసరిగా జరుగుతుంది. వైద్యరంగం రోగనిర్ధారణ పరీక్షల్లో గణాంకాల ప్రాధాన్యం అధికంగా ఉంటున్నది. పరిశోధనలు చేసే సంస్థలకు గణాంకాలు ఉపయుక్తంగా ఉంటాయి. ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఆడిటింగ్ రంగాలు సంఖ్యాశాస్త్రం మీద మాత్రమే ఆధారపడతాయి.

– మధుపాలీ
సెల్: 9949700037

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

వ్యాఖ్య

కునారిల్లుతున్న ఉన్నత విద్యారంగం

భారతదేశంలో ఆర్థిక సంస్కరణల తరువాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉన్నత విద్యారంగంలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరిగింది. 2022 నాటికి దేశంలో వున్న 950 యూనివర్శిటీలలో 51 శాతం ప్రైవేట్, డీమ్డ్ యూనివర్శిటీలే. విద్యార్థి నమోదు నిష్పత్తి (జి.ఇ.ఆర్) 26 శాతం ఉన్నప్పటికి చైనా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలతో పోల్చినప్పుడు చాలా తక్కువగా ఉన్నది. స్థూల నమోదు నిష్పత్తి దళితులలో 18.5 శాతం, గిరిజనులలో 13.3 శాతం మాత్రమే ఉన్నది. రాష్ట్రాల మధ్య కూడా చాలా తేడాలు ఉన్నాయి. ఉన్నత విద్యలో విస్తరణ - నాణ్యత - సామాజిక న్యాయం మధ్య సమతుల్యత ఉండాలి.

ఆంధ్రప్రదేశ్ - విశ్వవిద్యాలయాలు

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఆంధ్రా యూనివర్శిటీ 1926లో ఏర్పడి మరో మూడేళ్ళలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోబోతున్నది. జిల్లాకి ఒక యూనివర్శిటీ ఉండాలినే నేపథ్యంలో యోగి వేమన, నన్నయ్య, విక్రమ సింహపురి, రాయలసీమ వంటి యూనివర్శిటీలు ఏర్పడ్డాయి. ఈ యూనివర్శిటీల్లో గత 15 ఏళ్ళుగా రిక్రూట్‌మెంట్ లేకపోవటంతో 'అకడమిక్' క్షీణత ప్రారంభమైంది. ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ప్రస్తుతం 4 వేలకు పైగా ఖాళీలు ఉన్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో అధ్యాపకులు పని చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉన్నది. వైస్ చాన్సలర్లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల నియామకం పూర్తి రాజకీయ కోణంలోనే జరుగుతూ 'అకడమిక్' నిపుణతకు ప్రాధాన్యత లేకుండా పోయింది.



కె.ఎస్.లక్ష్మణరావు

ప్రైవేట్ యూనివర్సిటీలు

రాష్ట్రంలో బ్రౌన్‌ఫీల్డ్ యూనివర్శిటీల పేరుతో గీతం, కోనేరు లక్ష్మయ్య, విజ్ఞాన్, విట్, ఎస్.ఆర్.ఎమ్, అమృత, మోహన్ బాబు, అపోలో మొదలైన ప్రైవేట్, డీమ్డ్ యూనివర్శిటీలు పనిచేస్తున్నాయి. ఈ యూనివర్శిటీలలో టెక్నాలజీ కోర్సులు మాత్రమే ఉంటాయి. రిజర్వేషన్లు ఉండవు. ఫీజులపై, చేర్చుకునే విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. ప్రభుత్వ నియంత్రణ లేదు. రాష్ట్రంలో గల 280 ఇంజనీరింగ్ కాలేజీలు 200 ఎమ్.బి.ఎ, ఎం.సి.ఎ కాలేజీలు, 150 బి-ఫార్మసీ కళాశాలల్లో 90 శాతం ప్రైవేట్ కాలేజీలే. వీటిలో విద్యా ప్రమాణాలపై తనిఖీ యంత్రాంగం లేదు.



విద్యారంగ నిపుణులతో చర్చించకుండా, ఉన్నత విద్యామండలి చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలు విద్యార్థులకు నష్టాన్ని కలుగచేస్తున్నాయి. యూనివర్శిటీలలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న 'ఆన్‌లైన్ అడ్మిషన్ల' విధానం వలన పేద విద్యార్థులు నష్టపోతున్నారు. ఇటీవల ఉన్నత విద్యామండలి ఏకపక్షంగా, ఎటువంటి సంసిద్ధత లేకుండా డిగ్రీని నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుగా చేయటమే కాకుండా, మూడు సబ్జెక్టుల విధానం రద్దు చేసి, మేజర్/ మైనర్ సబ్జెక్ట్ విధానం ప్రవేశపెట్టింది. అడ్మిషన్లు బాగా తగ్గిపోయాయి. ఉన్నత విద్యామండలి ధోరణి, పని తీరు పూర్తిగా మారాలి.

ఉన్నత విద్యామండలి పనితీరు

రాష్ట్రంలో ఉన్నత విద్యారంగ కార్యకలాపాలను సమన్వయ పరచటానికి, పర్యవేక్షించటానికి ఉన్నత విద్యామండలి ఏర్పడి పని చేస్తున్నది. అయితే, విద్యారంగ నిపుణులతో చర్చించకుండా, ఉన్నత విద్యామండలి చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలు విద్యార్థులకు నష్టాన్ని కలుగచేస్తున్నాయి. యూనివర్శిటీలలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న 'ఆన్‌లైన్ అడ్మిషన్ల' విధానం వలన పేద విద్యార్థులు నష్టపోతున్నారు. ఇటీవల ఉన్నత విద్యామండలి ఏకపక్షంగా, ఎటువంటి సంసిద్ధత లేకుండా డిగ్రీని నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుగా చేయటమే కాకుండా, మూడు సబ్జెక్టుల విధానం రద్దు చేసి, మేజర్/ మైనర్ సబ్జెక్ట్ విధానం ప్రవేశపెట్టింది. అడ్మిషన్లు బాగా తగ్గిపోయాయి. ఉన్నత విద్యామండలి ధోరణి, పనితీరు పూర్తిగా మారాలి.

ప్రాధాన్యత కోల్పోతున్న శాస్త్రాలు

ఉన్నత విద్య ద్వారా సమాజానికి అవసరమైన అన్ని శాస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు, జీవ శాస్త్రాలు ప్రాధాన్యత కోల్పోయాయి. కేవలం టెక్నాలజీ కోర్సులకే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా ఈ ధోరణిని ప్రోత్సహిస్తున్నాయి. మానవులు కేవలం సాంకేతిక నిపుణులు, వస్తువుల ఉత్పత్తిదార్లు మాత్రమే కాదు. మానవులు చరిత్రను సృష్టించే సామాజిక, చారిత్రక జీవులు కూడా. మానవ సమాజంలోని విలువలు, నాగరికత, సామాజిక సంబంధాల పట్ల మనిషికి అవగాహన అవసరం. ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో విశ్వవిద్యాలయాలలో అన్ని శాస్త్రాలు అధ్యయనం చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

ప్రమాణాలు కోల్పోతున్న డిగ్రీ కళాశాలలు

రాష్ట్రంలో 1353 డిగ్రీ కాలేజీల్లో 1080 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలే. 152 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా అందులో 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలుగా ఉన్నాయి. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు ప్రభుత్వాలు అనుసరించిన విధానం ఫలితంగా గత 2 సంవత్సరాలలో 70 కాలేజీలు అన్-ఎయిడెడ్ కాలేజీలుగా మారాయి. మిగిలిన 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలలో కొద్ది సంఖ్యలో మాత్రమే ఎయిడెడ్ సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేయటం, తగిన మౌలిక వసతులు లేకపోవడం వలన చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది.

ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్యలు

పేద విద్యార్థులు, ముఖ్యంగా దళిత, గిరిజన, బి.సి. విద్యార్థులు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. జీవో నెం 77 జారీ చేసి....డిగ్రీ తరువాత పి.జి కోర్సులు ప్రైవేట్ సంస్థలలో చేస్తే ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ ఉండదు అని ప్రకటించటంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారు. జీవో నెం 77 రద్దు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలలో ఖాళీలన్నింటిని భర్తీ చేయాలి. యూనివర్శిటీలలో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ప్రైవేట్ యూనివర్శిటీలపై నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పరచాలి. డిగ్రీ కళాశాలలను పటిష్ఠ పరచాలి. జీవో నెం 77 రద్దు చేయాలి. సామాజిక, మానవీయ, జీవ శాస్త్రాలకు ప్రాధాన్యత కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రమాణాలు మెరుగుపరచాలి.

(వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083)

పాలస్తీనా వినాశనం అంచున ఉంది: సీతారాం ఏచూరి



కొచ్చి : పాలస్తీనా దశ్యాలు హదయవిదారకంగా ఉన్నాయని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సాలస్తీనీయులను నిర్మూలించే దిశగా దాడులు సాగుతున్నాయని ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు.. కొచ్చిలో జరిగిన పాలస్తీనా సంఘీభావ సదస్సును గురువారం నాడిక్కడ ఆయన ప్రారంభించారు. గాజా ఆసుపత్రిపై దాడి అత్యంత దుర్మార్గమైనదని ఏచూరి ఖండించారు. ఈ దాడికి సంబంధించి ఇజ్రాయెల్ తప్పుడు వార్తలను ప్రచారంలో పెడుతోందన్నారు. ఆస్పత్రిపై క్షిపణి దాడి చేసింది తాము కాదని, హమాస్ డిఫెన్సివ్ క్షిపణుల వల్ల ఆసుపత్రి ధ్వంసమైందంటూ ఇజ్రాయిల్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఇలాంటి బోగస్ వార్తల వెనుక ఆంతర్యాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

సైబర్ నేరగాళ్లపై సిబిఐ దాడులు

న్యూఢిల్లీ : సైబర్ నేరగాళ్లపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) మరోమారు దాడులు చేసింది. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీల సహకారంతో 11 రాష్ట్రాల్లోని 76 చోట్ల సోదాలు నిర్వహించింది. ఆర్థిక మోసాలకు సంబంధించి ఐదు వేర్వేరు కేసులు నమోదు చేసిన సిబిఐ ఆపరేషన్ "చక్రా–2" పేరుతో దాడులు చేసింది. ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయు) ఇచ్చిన సమాచారంతో క్రిప్టో కరెన్సీ మోసాలకు పాల్పడుతూ దాదాపు రూ.100 కోట్ల మోసానికి సంబంధించి సిబిఐ కేసు నమోదు చేసింది. కాల్ సెంటర్లను ఏర్పాటు చేసుకొని సాంకేతిక సహాయ సిబ్బందిగా వ్యవహరిస్తూ విదేశీయులే లక్ష్యంగా కొందరు మోసాలకు పాల్పడుతున్నారంటూ అమెజాన్, మైక్రోసాఫ్ట్ కంపెనీలు ఫిర్యాదు చేయడంతో సిబిఐ కేసులు నమోదు చేసి, సోదాలు చేపట్టింది.

మద్దతు ధరలు కంటి తుడుపు చర్యే

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఆరు రకాల రబీ పంటలకు మద్దతు ధరలు ప్రకటించడం కేవలం కంటి తుడుపు చర్య అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య, కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెంచిన ధరలు రైతులకు ఊరట కలిగించేవిగా లేవని, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు మేరకైనా పెంచలేదని విమర్శించారు. ఎరువులు, పురుగుల మందులు, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, గిట్టుబాటు కాని రైతాంగం ఇతర పంటలకు మరలిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. మద్దతు ధరలు పెంచాలని స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించినట్లుగా కేంద్ర ప్రభుత్వం పెంచలేదని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి కార్యదర్శి అరబింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ప్రకారమూ మద్దతు ధర పెంచలేదని, ఇప్పటికైనా మద్దతు ధరలు సి2+50 ప్రకారం నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

60 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. మొత్తం 60 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి జివో 2057ను గురువారం విడుదల చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల మధ్య 40% పెరిగిన రద్దీ

- రెడ్‌బస్ సిఇఒ ప్రకాష్ వెల్లడి

హైదరాబాద్ : ప్రస్తుత దసరా పండగ సీజన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య టికెట్ బుకింగ్‌లలో 40 శాతం పెరుగుదల కన్పించిందని ఆన్‌లైన్ బస్ టికెటింగ్ వేదిక రెడ్‌బస్ తెలిపింది. పరిశ్రమ గణంకాల ప్రకారం.. గడిచిన 14 రోజుల్లో ఈ రద్దీ చోటు చేసుకుందని ఆ సంస్థ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. హాలిడే సీజన్ సందర్భంగా హైదరాబాదీలు చాలామంది బాపట్ల, మచిలీపట్నం, రామోజీ ఫిల్మ్ సిటీలకు వెళ్తున్నారని పేర్కొంది. మరోవైపు తిరుపతి, శ్రీశైలం, అన్నవరం దేవస్థానాలకు కూడా ఎక్కువగా వెళ్తున్నారని తెలిపింది. పండుగల సమయంలో రోజుకు 3.2 లక్షల మంది ప్రయాణిస్తారని రెడ్‌బస్ సిఇఒ ప్రకాష్ సంగం అంచనా వేశారు.

అంతా గోప్యమే...!

- అటకెక్కుతున్న సర్వే ఫలితాలు
- మరుగునపడుతున్న వాస్తవాలు
- బలహీనపడుతున్న గణాంక వ్యవస్థ


న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వాస్తవాలను కప్పిపెడుతోంది. అధికారిక సమాచారాన్ని తారుమారు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోంది. గణాంకాలను రాజకీయ ఆయుధాలుగా మలచుకుంటూ ఎన్నికలలో ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ చర్యల కారణంగా ఒకప్పుడు దేశానికే పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన జాతీయ గణాంక వ్యవస్థ ఇప్పుడు బలహీనపడిందని, విశ్వసనీయతను కోల్పోతోందని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, ఆర్థికవేత్త జయతీ ఘోష్ ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకులకు ప్రజల జీవన స్థితిగతులపై కనీస పరిజ్ఞానం ఉండి తీరాలి. ఎందుకంటే వారి జీవితాలను బాగుచేయాలంటే ఆ అవగాహన అవసరం. ప్రజలు ఎలా జీవిస్తున్నారు, వారు ఏం పని చేస్తున్నారు, ఎంత ఆర్జిస్తున్నారు, ఆదాయం – సంపదలో అసమానతలు, కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, విద్య – నైపుణ్యం ఏ స్థాయిలో ఉన్నాయి వంటి వివరాలన్నీ ప్రభుత్వాలకు తెలియాల్సిన అవసరం ఉంది.

స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ పాలకులు జరిపిన జనగణనలో కొంత మౌలిక సమాచారం లభించేది. 1950 తర్వాత గణాంక సేకరణలో పద్ధతులు మారాయి. స్థూల దేశీయోత్పత్తి వంటి జాతీయాదాయ సూచికలను అభివృద్ధి చేశారు. అలాగే ఆర్థిక ప్రణాళికలను రూపొందించారు. వినియోగ సర్వేల ఆధారంగా పేదరిక సూచికలను తయారు చేసి వెనుకబాటుతనాన్ని గుర్తించారు.

సర్వే ఫలితాలలో గోప్యత

2014 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అత్యవసర సమాచారం లభ్యత, విశ్వసనీయతలో పలు నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ ఆదాయ లెక్కింపునకు ప్రాతిపదికగా తీసుకోవాల్సిన సంవత్సరాన్ని మార్చడంతో ఈ మార్పులు ప్రారంభమయ్యాయి. పారిశ్రామిక ఉత్పత్తిని లెక్కించే పద్ధతి కూడా మారింది. దీంతో 'కాగితాల'పై ఉత్పత్తి బాగా పెరిగి మోడీ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. 2017–18కి సంబంధించి కార్మికుల సంఖ్యపై చేసిన సర్వే ఫలితాలు 2018 చివరలో అందుబాటులో ఉన్నప్పటికీ 2019 ఎన్నికలు పూర్తయ్యే వరకూ వాటిని బయటపెట్టలేదు. ఎందుకంటే ఆ కాలంలో ఉద్యోగ కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడమో లేదా తగ్గడమో జరిగింది. మరో దారుణమైన విషయమేమంటే 2017–18కి సంబంధించి వినియోగ వ్యయంపై జరిపిన సర్వే ఫలితాలను వెల్లడించేందుకు కూడా ప్రభుత్వం నిరాకరించింది. ఆ నివేదికను కొందరు మీడియా ప్రతినిధులు బయటపెట్టారు. 2011–12 నుంచి 2017–18 వరకూ గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం తగ్గిందని, అదే సమయంలో పేదరికం పెరిగిందని ఆ సర్వే తెలిపింది. అప్పటి నుంచీ నేటి వరకూ దేశంలో వినియోగ సర్వే జరగనే లేదు. పేదరికం, ఆహార వినియోగం, అసమానతలు వంటి విషయాలలో వాస్తవాలు తెలుసుకోవాలంటే ఈ సర్వే జరపడం చాలా అవసరం. 2011–12 తర్వాత అంటే దశాబ్ద కాలం పాటు ఈ కీలక సూచికలపై ఎలాంటి సమాచారం అందుబాటులో లేదు. పేదరికంపై అత్యవసరమైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో నీతి ఆయోగ్ సొంత సూచికను అభివృద్ధి



చేసింది. ఈ సూచిక ఏం చెబుతోంది? గత దశాబ్ద కాలంలో పేదరికం తగ్గిందట.

2011 లెక్కలే ఆధారం

కోవిడ్ అనంతరం దేశంలో జనజీవనం సాధారణ స్థాయికి చేరినప్పటికీ జనగణనను వాయిదా వేయడానికి ప్రభుత్వం కోవిడ్‌ను సాకుగా చూపుతోంది. సార్వత్రిక ఎన్నికల తర్వాతే జనాభా లెక్కల సేకరణ జరిపే అవకాశం ఉంది. ఇప్పుడు దేనికైనా 2011 జనగణన లెక్కలే ఆధారంగా ఉంటున్నాయి. అంటే మౌలిక సమాచారం లేకుండానే ప్రభుత్వం పనిచేస్తోందన్న మాట. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు ప్రయత్నించగా కేంద్రం అడ్డుకుంది.

ప్రణాళికలు సైతం...

ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలు కూడా బయటకు రావడం లేదు. గంగ కార్యాచరణ ప్రణాళిక నేటికీ విడుదల కాలేదు. 2019 – 21 సంవత్సరాలకు సంబంధించి జరిపిన కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలు ప్రభుత్వ వాదనకు భిన్నంగా ఉన్నాయి. దీనిని జీర్ణించుకోలేని మోడీ ప్రభుత్వం సర్వే సంస్థపై పసలేని ఆరోపణలు మోపి సస్పెండ్ చేసింది. తద్వారా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా ఉండే ఫలితాలను ప్రచురించవద్దని ప్రస్తుత సర్వే నిర్వాహకులకు పరోక్షంగా సంకేతాలు పంపింది. సర్వేలు నిగ్గు తేల్చిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకపోతే వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వం ఏ విధంగా విధానాలను రూపొందిస్తుందని జయతీ ఘోష్ ప్రశ్నించారు.

దేశంలో నిరుపేదలు 17.6 కోట్లు

- ప్రపంచబ్యాంక్ తాజా అంచనా

న్యూఢిల్లీ : గత ఐదేళ్లలో దేశంలో పేదరికం ఏమాత్రం తగ్గలేదు. 2018లో ఏ స్థాయిలో ఉన్నదో గత సంవత్సరం కూడా అదే స్థాయిలో ఉన్నదని ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక తెలిపింది. ఆ నివేదిక ప్రకారం 2018లో 15 కోట్ల 17 లక్షల మంది భారతీయులు పేదరికంతో అలమటించగా, 2019లో ఆ సంఖ్య 17 కోట్ల 60 లక్షలకు పెరిగింది. అంటే ఆ సంవత్సరంలో పేదల సంఖ్య సుమారు 2 కోట్ల 40 లక్షలు పెరిగిందన్న మాట. 2018లో పేదరిక రేటు 11.09% ఉంటే 2021లో 11.9%గా నమోదైంది. 2020లో చాలా ఎక్కువగా అంటే 14.72%గా ఉంది. కేంద్ర ప్రభుత్వం వద్ద 2011–12 నుండి కుటుంబ వినియోగదారుల వ్యయ సర్వే (సిఇఎస్) సమాచారం అందుబాటులో లేదు. మన దేశంలో పేదరికానికి సంబంధించిన అంచనాల కోసం 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' సంస్థ పైనే ప్రపంచబ్యాంక్ ఆధారపడింది. 2022–23, 2023–24కు సంబంధించిన సిఇఎస్‌ల ఫలితాలు సార్వత్రిక ఎన్నికల తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది. 2017–18లో ప్రభుత్వం ఇలాంటి సర్వేని జరిపినప్పటికీ బహిర్గతం చేయలేదు. బయటికి పొక్కిన సమాచారం ప్రకారం గత 45 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 2018లో గరిష్ట స్థాయికి చేరింది. కోవిడ్‌కు ముందు 2018–19లో పేదరికం పెరగడానికి అనేక కారణాలున్నాయని ఒకప్పటి ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎన్‌సి సక్సేనా చెప్పారు. ప్రభుత్వం 2017–18లో నిర్వహించిన వినియోగ సర్వే ప్రకారమే పేదరికం పెరిగింది. 2005–15 మధ్యకాలంలో నిర్మాణాలలో పెట్టుబడులు బాగా పెరిగాయి. 2015 తర్వాత అవి తగ్గిపోయాయి. వాస్తవ వేతనాలలో పెరుగుదల లేదని గణాంకాలు చెబుతున్నాయి. కార్మికుల సంఖ్య కూడా పెద్దగా పెరగలేదు. దీనివల్ల చాలా మందికి ఉద్యోగాలు లేకపోవడమో లేదా వారు ఉద్యోగాల కోసం వెదకడమో జరిగింది. మన దేశంలో 2019లో అత్యంత పేదలుగా ఉన్న వారి సంఖ్యకు సంబంధించి తాను వేసిన అంచనాలను ప్రపంచబ్యాంక్ సవరించింది. కడు పేదరికాన్ని అనుభవిస్తున్న వారి సంఖ్యను 13 కోట్ల 68 లక్షలుగా చూపిన ప్రపంచబ్యాంక్, ఆ తర్వాత దానిని సవరించి 17 కోట్ల 60 లక్షలుగా నమోదు చేసింది. కోవిడ్ కారణంగా 2020లో ఐదు కోట్ల 60 లక్షల మంది భారతీయులు అత్యంత పేదరికంలో మగ్గిపోయారు.

ఎన్ఇపిని రద్దు చేయాలి

- పౌర సంఘాల డిమాండ్

చెన్నై : కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)ని రద్దు చేయాలని పౌర సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'ఎన్ఇపి నుంచి విద్యను కాపాడాలి' పేరుతో చెన్నైలోని లయోలా కాలేజీలో కాన్ఫరెన్సును ఏర్పాటు చేశాయి. 36 పౌర సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. విద్యా మంత్రిత్వ శాఖను పక్కకు నెట్టి రాష్ట్రపతి అధ్యక్షతన ఉన్నత స్థాయి రాష్ట్రీయ శిక్షా ఆయోగ్‌ను ఏర్పాటు చేయటంపై పౌరసంఘాలు కేంద్రం తీరును విమర్శించాయి. ఈ సమావేశానికి కేరళ ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్ఇపి విద్యా విధానం విషయంలో కేంద్రం అనుసరించిన తీరును ఆమె విమర్శించారు. దీనిపై అధ్యయనం జరగలేదన్నారు. తమిళం, తెలుగు, మళయాలం, కన్నడ, ఒడియా భాషలు కేవలం రూ.29 కోట్లు నిధులను పొందాయని డిఎంకె ఎమ్మెల్యే తిరువళ్లువర్ తెలిపారు. ఈ సమావేశానికి యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జె. గాంధీ రాజ్ అధ్యక్షత వహించారు. విద్యావేత్త అయేషా నటరాజన్, ఆర్థికవేత్త వెంకటేశ్ ఆత్రేయ, రచయిత అద్వాన్ దీక్షన్య, ఇతరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రబీ పంటలకు కనీస మద్దతు ధరలు బూటకం!

- మోడీ ప్రభుత్వ నాటకాలను బయటపెట్టాలి
- దేశవ్యాపిత నిరసనలకు ఎఐకెఎస్ పిలుపు

న్యూఢిల్లీ : రైతులకు, రాయితీలతో కూడిన పంటల వైవిధ్యతకు ప్రోత్సాహక ధరలకు హామీ కల్పిస్తూ 2024–25 రబీ మార్కెటింగ్ సీజనుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి)ను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఖండించింది. అఖిల భారత స్థాయిలో సగటు ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు ఇస్తున్నామంటూ చెప్పడాన్ని తీవ్రంగా విమర్శించింది. గోధుమలు క్వింటాల్‌కు రూ.150 అధికంగా మద్దతు ధర ఇవ్వడం 2014 నుండి అత్యంత అధికమని ప్రభుత్వం పేర్కొనడం బూటకమని కిసాన్‌సభ విమర్శించింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంఎస్‌పి ప్రకటిస్తారనే వాస్తవాన్ని ఎవరైనా దృష్టిలో పెట్టుకుంటే ఇది బూటకమని స్పష్టంగా వెల్లడవుతుందని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యయమంటూ ప్రస్తావించినది సమగ్ర సి 2 వ్యయం కాదని, అతి తక్కువగా వున్న ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ అని ఆ ప్రకటన పేర్కొంది. రైతులను మోసగించేందుకు నిజాయితీ లోపించిన ప్రయత్నమని విమర్శించింది. రైతులను ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణా రైతులను తప్పుదారి పట్టించేందుకు బిజెపి ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని వారు విమర్శించారు.

సి2 వ్యయానికి, ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ వ్యయానికి చాలా ఎక్కువగా తేడా కనిపిస్తోందని, అలాగే రాష్ట్ర ప్రతిపాదనలకు, సిఎసిపి ప్రతిపాదనలకు కూడా తేడా బాగా వుందని పేర్కొంది. ప్రతి పంటకు క్వింటాల్‌కు రైతులు ఎదుర్కొనే నష్టాలను ఆ ప్రకటనలో వివరించారు. గోధుమ



పంటకు క్వింటాల్‌కు సి2 వ్యయాన్ని రూ.2051గా పంజాబ్ ప్రభుత్వం అంచనా వేసింది. అదే సమయంలో సిఎసిపి చేపట్టిన ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ వ్యయం కేవలం క్వింటాల్‌కు రూ.741గా వుంది. అంటే సి2 వ్యయానికన్నా క్వింటాల్‌కు ఏకంగా రూ.1310 తక్కువగా వుందని ఆ ప్రకటన వివరించింది. పంజాబ్‌లో దాదాపు 35 లక్షల హెక్టార్లలో గోధుమ పంట సాగవుతోంది. ఈ రకంగా పంజాబ్ రైతులు ఒక్క గోధుమ పంటకు సంబంధించే ఏకంగా రూ.13,500కోట్లు నష్టపోతున్నారని కిసాన్‌సభ నేతలు వివరించారు. మహారాష్ట్రలో ఏటా గోధుమ రైతుల నష్టం రూ.4640 కోట్లుగా వుంది. చనా (కాబూలీ శనగలు) విషయంలో తెలంగాణా రాష్ట్ర సి2 అంచనా క్వింటాల్‌కు రూ.6055గా వుండగా, ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ కేవలం క్వింటాల్‌కు రూ.2290గానే వుంది. అంటే క్వింటాల్‌కు రూ.3765 తక్కువగా వుంది. క్వింటాల్ ఎంఎస్‌పిని రూ.9351గా ప్రకటించాలని రాష్ట్రం సూచించింది. అంటే ప్రకటించిన ఎంఎస్‌పి కన్నా క్వింటాల్‌కు రూ.3911 ఎక్కువన్నమాట. ఇక్కడ రైతు హెక్టార్‌కు రూ.58,665 నష్టపోతున్నాడు.

నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా భారతదేశంలోని రైతులు పదే పదే నష్టపోతున్నారు. మోసగించబడుతున్నారు. పైగా రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామంటూ ప్రభుత్వం ఊదరగొడుతోంది. చివరకు ఏ మాత్రమూ ప్రోత్సాహకరంగా లేని రీతిలో ప్రకటించిన ఎంఎస్‌పి కూడా కేవలం ఊహాత్మకంగానే వుంది. ఎందుకంటే కొనుగోళ్లు లేనందున మెజారిటీ రైతులకు ఇది ఎలాంటి లాభాలను ఇవ్వడం లేదు. అందువల్లే ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీ కల్పించాలని రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారని ఎఐకెఎస్ పేర్కొంది.

ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేసేలా, సమాజంలోని అన్ని వర్గాలకు ఈ సమాచారాన్ని చేరవేసేలా చర్యలు తీసుకోవాలని, నిరసన తెలియజేయాలని ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది. పెద్దమొత్తంలో డబ్బును వాణిజ్య ప్రకటనలకు వెచ్చిస్తూ, కార్పొరేట్ మీడియాను తమ ప్రచారానికి ఉపయోగించుకుంటున్న బిజెపికి ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లోని ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరింది.

పంట	ఎ2+ఎఫ్ఎల్	సి2	సి2–ఎ2+ఎఫ్ఎల్	ఎంఎస్‌పి	సి2+50	రైతుకునష్టం(క్వింటాలుకు)
గోధుమ	1128	1652	524	2275	2478	203
బార్లీ	1158	1614	456	1850	2421	571
సెనగలు	3400	4547	1147	5440	6820.5	1380.5
ఎర్ర కందిపప్పు	3405	4890	1485	6425	7335	910
ఆవాలు	2855	4068	1213	5650	6102	452
కుసుమపువ్వు	3807	5414	1607	5800	8121	2321

నేడు 101వ వసంతంలోకి వియస్

'ఎ సెంచరీ ఆఫ్ స్ట్రగుల్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్న సిఎం



తిరువనంతపురం : సిపిఐ (ఎం) ప్రముఖ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి వియస్ అచ్యుతానందన్ శుక్రవారం 101వ వసంతంలోకి ప్రవేశించనున్నారు. సిపిఐ(ఎం) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన వియస్ ఎనిమిది దశాబ్దాలకు పైగా రాజకీయ కార్యకలాపాలు సాగించడం ద్వారా పేద ప్రజల పోరాట చరిత్రలో భాగమయ్యారు. పున్నప్ర వాయలార్ పోరాట యోధుడుగా, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడుగా, రాష్ట్ర కార్యదర్శిగా, ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, శాసనసభ్యుడిగా, పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్‌గా, దేశాభిమాని వార్తాపత్రిక సంపాదకుడిగా వివిధ బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేసి, అందరి అభిమానాన్ని చూరగొన్నారు. జాతీయ కౌన్సిల్‌కు రాజీనామా చేసి 1964లో సిపిఐ (ఎం) స్థాపించిన 32 మంది సభ్యులలో జీవించి ఉన్న ఇద్దరు సభ్యులలో ఒకరు. మరొకరు తమిళనాడుకు చెందిన శంకరయ్య.

ఆరోగ్య సమస్యల కారణంగా తిరువనంతపురంలోని బార్టన్‌హిల్‌లోని తన కుమారుడు విఎ అరుణ్‌కుమార్ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నందున పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కేక్ కటింగ్ ఉంటుంది. వియస్ అచ్యుతానందన్ ప్రజాసేవ, జీవితాన్ని గుర్తు చేస్తూ ప్రముఖ పాత్రికేయుడు కెవి సుధాకరన్ రచించిన "ఎ సెంచరీ ఆఫ్ స్ట్రగుల్" పుస్తకాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ విడుదల చేయనున్నారు.

అక్టోబరు 20, 1923న అలప్పుజలోని పున్నప్ర వేంటలతరవీట్‌లో శంకరన్, అక్కమ్మ దంపతులకు అచ్యుతానందన్ జన్మించారు. 1939లో స్టేట్ కాంగ్రెస్‌లో చేరిన వియస్ 1940లో పదిహేడేళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. బ్రిటీష్ పాలనలో, ఆయన కొబ్బరి – వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసి ఉజ్వల పోరాటాలకు నాయకత్వం వహించాడు. తీవ్రమైన నిర్బంధం, లాఠీ దెబ్బలు, జైలు శిక్ష అనుభవించారు. 2919 అక్టోబర్ 24 నుంచి ఆయన అనారోగ్యంతో చికిత్స పొందుతూ, విశ్రాంతి తీసుకుంటున్నారు.

వెనిజులాపై అమెరికా ఆంక్షల పాక్షిక సడలింపు!



జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు జార్జ్ రోడ్రిగ్జ్ నుంచి మంగళవారం ఒప్పంద పత్రాలు స్వీకరిస్తున్న వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురో

వాషింగ్టన్ : వెనిజులాలోని కొన్ని పరిశ్రమలపై విధించిన ఆంక్షలను ఆరు మాసాలపాటూ సడలిస్తూ అమెరికా ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. వెనిజులా ఇంధన పరిశ్రమకు బుధవారం అమెరికా ఆర్థిక శాఖ తాత్కాలిక ఉపశమనాన్ని ప్రకటించడంతో మరింత పునరుత్తేజంతో చమురు, గ్యాస్ మార్కెట్‌లోకి దేశం ప్రవేశిస్తోందని అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రకటించారు. ఎంపిక చేసిన రంగాలపై నిర్దిష్ట ఆంక్షలను నిలుపుచేస్తూ నాలుగు జనరల్ లైసెన్స్‌లను జారీ చేశారు. వెనిజులా ప్రభుత్వం, బార్బడోస్‌లో ప్రతిపక్షం మధ్య కుదిరిన ఎన్నికల ప్రణాళికకు ప్రతిస్పందనగా ఈ ప్రకటన వెలువడింది. ఈ ఒప్పందాలు, నిర్ణయాలతో చమురు, గ్యాస్ మార్కెట్‌లో ప్రగతిశీలమైన పద్ధతిలో ప్రవేశిస్తున్నామని మదురో తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చారో దాన్ని బట్టి లైసెన్సుల పునరుద్ధరణ వుంటుందని ఆర్థిక శాఖ ప్రకటన పేర్కొంది.

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. తమపై నమోదైన చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కేసులో పోలీసు రిమాండ్‌ను సవాల్ చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్ వెబ్‌సైట్ హెచ్‌ఆర్ విభాగం హెడ్ అమిత్ చక్రవర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ పోలీసుల స్పందనను సుప్రీంకోర్టు కోరింది. గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను అక్టోబరు 30కు వాయిదా వేసింది. ప్రబీర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రబీర్ రిమాండ్‌లో ఉన్నారు. ఆయన వయసు 72 ఏళ్లు. కనుక త్వరగా విచారణ జరపండి' అని కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. తాము నోటీసులు జారీ చేస్తామని, మూడు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను ఆదేశిస్తామని పేర్కొంది. అది చాలా దూరం అవుతుందని, వెంటనే విచారించాలని కపిల్ సిబల్ కోరారు. 'దీన్ని శుక్రవారమే విచారణకు తీసుకోలేము. శుక్రవారం మాత్రమే పని దినం (దసరా సెలవులకు ముందు). అక్టోబరు 30 వచ్చే సోమవారం జాబితా చేస్తాం' అని ధర్మాసనం తెలిపింది. హెచ్‌ఆర్ విభాగ అధిపతి తరపున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ తమ కేసు వినాలని, ఇందులో కూడా నోటీసులు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. దీనికి స్పందించిన ధర్మాసనం ఆ కేసులో కూడా నోటీసులు ఇస్తామని పేర్కొంది. పోలీసు కస్టడీకి అప్పగించాలన్న ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పుర్కాయస్థ, చక్రవర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



శివాజీ పట్నాయక్ స్మృతి ప్లాజాను ప్రారంభిస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్

శివాజీ పట్నాయక్ స్మృతి ప్లాజా ప్రారంభం

భువనేశ్వర్ : సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కీర్తిశేషులు శివాజీ పట్నాయక్ గౌరవార్థం భువనేశ్వర్‌లో ఏర్పాటు చేసిన స్మృతి ప్లాజాను ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. సిపిఎం కార్యాలయం సమీపంలోని జయదేవ విహార్ పాల్ హైట్స్‌లో 615 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భువనేశ్వర్ డెవలప్‌మెంట్ అథారిటీ (బిడిఎ) ఈ ప్లాజాను నిర్మించింది. శివాజీ పట్నాయక్ జయంతి సందర్భంగా గత మేలో ఈ ప్లాజాకు సిఎం నవీన్ పట్నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ ప్లాజాలో శివాజీ పట్నాయక్ జీవితం, ఆయన సాధించిన విజయాల గురించిన వివరాలున్నాయి. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల కోసం ఆయన చేసిన కృషిని తెలియజేసేలా ఉంది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి అలీ కిషోర్ పట్నాయక్, రాష్ట్ర మంత్రులు ఉషాదేవి, అశోక్ చంద్రపండా, భువనేశ్వర్ మేయర్ సులోచనదాస్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

పండ్ల తోటల రైతులకు ప్రోత్సాహం కరువు

- రాష్ట్ర సదస్సులో నాయకులు

ప్రజాశక్తి–తాడిపత్రి (అనంతపురం జిల్లా)

పండ్ల తోటల రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రోత్సాహమూ అందించకుండా అత్యంత నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నాయని రైతు సంఘం నాయకులు అన్నారు. పండ్ల తోటల రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా తాడిపత్రిలో గురువారం రాష్ట్ర సదస్సు జరిగింది. పండ్ల తోటల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 19 రకాల పండ్లు, 23 రకాల కూరగాయలు, తొమ్మిది రకాల సుగంధ ద్రవ్యాల పంటలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో వీటి సాగు మరింత ఎక్కువగా ఉందన్నారు. గత ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని పండ్ల తోటల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిందని, ఆచరణలో సాగు రైతులకు అందించిన సాయం నామమాత్రమేనని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక పండ్ల తోటలను పూర్తిగా విస్మరించిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహాన్ని కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల్లో ధైర్యం నింపాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రకాల పండ్ల తోటలకు మాత్రమే పంటల బీమా అమలు చేస్తూ.. రైతులను నిరుత్సాహానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండ్ల తోటల రైతుల సమస్యలపై ప్రభుత్వాలు అవలంభిస్తోన్న నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఇందు కోసం రైతులు ఐక్యం కావాలని కోరారు. పండ్ల తోటల రైతులకు ఎపి రైతు సంఘం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం పండ్ల తోటల రైతుల సమస్యలపై 10 తీర్మానాలను సమావేశంలో ప్రవేశపెట్టారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. వీటి పరిష్కారం కోసం ఐక్యపోరాటాలు నిర్వహించేలా తీర్మానం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, రైతు సంఘం నంద్యాల జిల్లా నాయకులు నరసింహ, కడప జిల్లా నాయకులు దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

నెతన్యాహుతో రిషి సునాక్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

మానవతా సాయాన్ని ఈజిప్ట్ రెడ్‌క్రీసెంట్ అధికారులకు అందజేస్తామని డిప్యూటీ మంత్రి ఇలియా డెనిసొవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధ్యప్రాచ్యంలో సుస్థిరత కోసం ఈజిప్టుతో కలిసి పనిచేస్తాం : జిన్‌పింగ్

మధ్య ప్రాచ్యంలో మరింత సుస్థిరత నెలకొనేలా చూసేందుకు ఈజిప్ట్‌తో కలిసి పనిచేస్తామని చైనా నేత జిన్‌పింగ్ చెప్పారు. గురువారం ఈజిప్ట్ ప్రధానితో ఆయన మాట్లాడారు. ఈజిప్ట్‌తో సహకారాన్ని పెంచుకుని ఈ ప్రాంతంలో, తద్వారా ప్రపంచంలో మరింత సుస్థిరత తీసుకురావాలన్నది చైనా అభిమతమని ఆయన పేర్కొన్నారు. చైనా, ఈజిప్ట్‌లు మంచి మిత్రదేశాలని, ఒకే లక్ష్యాలను కలిగి వున్నాయని, పరస్పరం విశ్వాసం కలిగి వున్నాయని పేర్కొన్నారు.

పాలస్తీనా అధ్యక్షుడితో మాట్లాడిన మోడీ

గాజా ఆస్పత్రిపై దాడి జరిగిన నేపథ్యంలో పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్‌లో మాట్లాడారు. ఆ దాడిలో అమాయకులు అసువులు బాయడం పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. పాలస్తీనియన్లకు మానవతా సాయాన్ని భారత్ కొనసాగిస్తుందని చెప్పారు. ఆ ప్రాంతంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు, హింస, తీవ్రవాదంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్–పాలస్తీనా సమస్యపై భారత్ దీర్ఘకాలంగా అనుసరిస్తున్న సూత్రబద్ధ వైఖరిని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అంతర్జాతీయ మానవతా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని భారత్ పిలుపిచ్చింది.

జోర్డాన్, ఈజిప్ట్ చర్చలు

మరోవైపు రాఫా క్రాసింగ్ మీదుగా మానవతా సాయాన్ని అనుమతించేందుకు వీలుగా గాజా క్రాసింగ్ వద్ద దెబ్బతిన్న రోడ్లను ఈజిప్ట్ మరమ్మత్తు చేస్తోంది. జోర్డాన్ రాజుతో గురువారం ఈజిప్ట్ అధ్యక్షుడు సిసి భేటీ అయ్యారు. గాజాలో క్షీణిస్తున్న పరిస్థితులను చర్చించారు. పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఉమ్మడిగా శిక్షను అమలు చేస్తున్న ఇజ్రాయిల్ విధానాన్ని వారు ఖండించారు. పాలస్తీనియన్లను వారి ఇళ్ల నుండి వెళ్లగొట్టి ఈజిప్ట్‌కు, జోర్డాన్‌కు పంపేయాలని చూస్తోందని విమర్శించారు. గాజాపై దాడుల గురించి టర్కీ, ఈజిప్ట్ మంత్రులు కూడా చర్చించారు.

ఇజ్రాయిల్ దాడిలో ముగ్గురు పాలస్తీనా వాసుల మృతి

గాజాలో రక్తపాతం సాగిస్తున్న ఇజ్రాయిల ఇంకా బుల్లెట్ల వర్షం కురిపించి, పాలస్తీనియన్లను బలితీసుకుంటోంది. గురువారం వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిలీ బలగాలు జరిపిన కాల్పుల్లో 14 ఏళ్లు, 16 ఏళ్ల వయసున్న టీనేజర్లుసహా ముగ్గురు పాలస్తీనియన్లు మరణించారు.



చిన్నారి



JEEVANA జీవన the family

మొక్కలు



నాటండోయ్ ....నాటండి
మొక్కలనే ...నాటండి
మన చుట్టూ పరిసరాలను
పచ్చంగా ఉంచండి
మొక్కలే కదా జీవాధారం
మొక్కలే కదా ప్రాణాధారం

ఆహారాన్ని ఇచ్చే మొక్కలు
ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కలు
మొక్కలలో మూడు రకాలు
తీగలు,పొదలు, వృక్షాలు

ఆవాసాన్ని ఇచ్చే మొక్కలు
ఉపకరణాలను ఇచ్చే మొక్కలు
మొక్కలలో మూడు రకాలు
తీగలు ,పొదలు, వృక్షాలు

వర్షాలను ఇచ్చే మొక్కలు
ప్రాణ వాయువు ఇచ్చే మొక్కలు
మొక్కలలో మూడు రకాలు
తీగలు ,పొదలు, వృక్షాలు

- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240.

సరైన పదాలు రాయండి

పిల్లలూ, బొమ్మను చూసి కింది గళ్లల్లో సరైన పదం రాయండి.



\- - - చెట్టుపై ఉన్నది



పండ్లు - - - లో ఉన్నాయి



\- - - పండు తియ్యన

నేను గీసిన బొమ్మ



బి.మహిత,
8వ తరగతి,
విద్యానగర్,
మంత్రాలయం మండలం,
కర్నూలు జిల్లా.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గడ్డు రోగాలకు చవకైన వైద్యం



ఆయన ప్రజలను భయపెట్టే రోగాలకు ఎదురెళ్లారు. వాటిని సులభంగా ఎదిరించే ధైర్యాన్ని, మెలకువనీ అందరికీ అందించారు. సాంక్రమిత వ్యాధుల ఆనుపానులను అంచనా వేసి, వాటిని అప్రమత్తంగా అణగదొక్కే ఉపాయాలను కనిపెట్టారు. రోగులకు, బాధితులకు సులభ చికిత్స హస్తం అందించారు. ఆయన ప్రముఖ సాంక్రమిత వ్యాధుల నివారణ నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణ. కాకినాడ కేంద్రం వైద్యం అందిస్తూ, అంతర్జాతీయ గుర్తింపు పొందారు.



పీడ, గత్తర, మహమ్మారి... ఇలా పేరేదైనా ఒక్కసారిగా జనం మీద విరుచుకుపడి వేలాది లక్షలాది ప్రాణాలను తీసే రోగాలు చరిత్ర నిండా విషాదం నింపాయి. ఆధునిక కాలంలోనూ వెంటాడుతున్నాయి. ఇటీవల కాలంలో కోవిడ్, ఎయిడ్స్. ఒకటి సునామీలా ఒకదానిని మించి ఒకటి ప్రజల్లో భయాందోళలు, భ్రాంతులు, విషాదాలను ప్రపంచ మానవుల్లో నింపాయి. డాక్టర్ యనమదల మురళీకృష్ణ తన పరిశోధనలు, పరిశీలనలతో ఈ పీడలకు నాణ్యమైన అతి చౌకైన వైద్యాన్ని కనిపెట్టారు. ప్రజలను నిరంతరం చైతన్య పరుస్తూ జ్ఞాన సంపన్నులను చేశారు. రెండు ప్రపంచ పీడల నుండి లక్షలాదిమందికి భరోసా కల్పించారు.

23 ఏళ్లక్రితం కాకినాడ కేంద్రంగా వైద్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన డాక్టర్ మురళీకష్ణ ఎంబిబిఎస్, ఎండి హెచ్ఐవి చికిత్సలో దిట్ట. రాష్ట్రంలో మొదటి సాంక్రమిక వ్యాధుల నిపుణునిగా ఆయన ప్రత్యేకంగా గుర్తింపు పొందారు. 6 వేల మంది హెచ్ఐవి బాధితులకు చికిత్సలు అందజేశారు. వారి జీవిత కాలాన్ని వృద్ధి చేసి, జీవన ప్రమాణాలను మెరుగు పర్చారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీలో ఎండి చేసిన మురళీకృష్ణ 1997 నుంచి హెచ్ఐవిపై పోరులో విశేషమైన కషి చేస్తున్నారు. హెచ్ఐవి రోగుల్లో వ్యాధి తీవ్రత అంచనాకు సీడీ4 లింఫోసైట్ కణాల సంఖ్య, హెచ్ఐవి వైరల్ లోడ్ పరీక్షలు చేస్తారు. ఇవి బాగా ఖరీదైనవి. అన్నీ చోట్లా లభ్యం కావు. ఎయిడ్స్ జబ్బులో అధికంగా ప్రాణాలు తీసేది క్షయ వ్యాధి. దీని బారిన పడిన రోగుల్లో ఖరీదైన పరీక్షల స్థానంలో చౌకగా దొరికే 'మాంటూ' (ట్యూబర్ క్యులిన్) పరీక్షను ఉపయోగించొచ్చునని డాక్టర్ మురళీకృష్ణ ప్రతిపాదించారు.

పరిశోధనలతో అంతర్జాతీయ గుర్తింపు

2000లో దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో జరిగిన 13వ అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధనా పత్రాలను మురళీకృష్ణ సమర్పించారు. ఆ సదస్సుకు ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన 5000 పైగా పరిశోధనల్లో 25 అత్యుత్తమ పరిశోధనలను ఎంపిక చేసి అతిపెద్ద మెడికల్ వెబ్‌సైట్ 'మెడ్ స్కేప్' ప్రచురించింది. ఆంధ్రప్రదేశ్ నుండి అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సుకు మొదటి, ఏకైక పరిశోధన సారాంశం డాక్టర్ మురళీకృష్ణదే కావటం, ఆ పరిశోధనకు మెడ్ స్కేప్ ఎంపిక చేసిన అత్యుత్తమ పరిశోధనల్లో చోటు దక్కడం తెలుగు వారికి గర్వ కారణం. హెచ్ఐవిపై వివిధ పత్రికల్లో 40 వరకు పరిశోధనాత్మక వ్యాసాల ద్వారా మురళీకృష్ణ ప్రజల్లో అవగాహన కల్పనకు కృషిచేశారు. అనేక అవగాహన వ్యాసాలను రాశారు. 2000లో మొదటిసారి ఆయన ప్రచురించిన 'ఎయిడ్స్' పుస్తకం గొప్ప జనాదరణ పొందింది.

అపోహల తొలగింపు, వివక్షకు వ్యతిరేకంగా కృషి

2000 ప్రాంతంలో హెచ్ఐవి సోకిన వారిని సమాజంలో హీనంగా చూసేవారు. హెచ్ఐవి-ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు మిగతా అందరితోనూ సమానం అని, వారిని ఆదరించాలని వివక్షకు వ్యతిరేకంగా జన బహుళ్యాన్ని చైతన్య పరచడానికి డాక్టర్ మురళీకృష్ణ అనేక విధాలుగా కృషి చేశారు. గ్లౌజులు లేకుండా నేరుగా పరీక్ష చేసింది డాక్టర్ మురళీకృష్ణనే అని పేషెంట్లు ఇప్పటికీ అబ్బురంగా చెప్తుంటారు. బహిరంగ సభల నుంచి వైద్యుల సమావేశాల వరకు అన్ని స్థాయిల్లో ప్రసంగించి ఆయా సమూహాల్లో ఎయిడ్స్ వ్యాధి పట్ల అపోహలను పోగొట్టారు. హెచ్ఐవి గురించి సలహాలు ఇవ్వటం, మానసిక ఆరోగ్యాన్ని ఎలా పరిరక్షించుకోవాలి అనే విషయంపై ఆయన అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

సేవలకు ప్రతిభా పురస్కారం

ఏటేటా దేశవ్యాప్తంగా వివిధ సూపర్ స్పెషాలిటీల్లో ప్రజారోగ్య పరిరక్షణ కోసం విశేష కషిచేసిన వైద్య నిపుణులను గుర్తించి బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డులను అందిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఏడుగురిని ఎంపికచేయగా, వారిలో డాక్టర్ మురళీకష్ణ ఒకరు. దేశ రాజధాని ఢిల్లీలో ఆరోగ్యరంగ ప్రతిభా పురస్కారం-2023ను ఇటీవల ఆయన తన సతీమణి గీతతో కలిసి అందుకున్నారు.

రెండు రకాల యాంటీరెట్రో వైరల్ కాంబినేషన్

అందుబాటులో వున్న మందులపై పూర్తి అవగాహనతో హెచ్ఐవి చికిత్స తీసుకోని (యాంటీ రెట్రో వైరల్ నైవ్) పేషెంట్లలో రెండు ఔషధాల కాంబినేషన్ చికిత్స మెరుగైన ఫలితాలను అందిస్తుందని పేర్కొంటున్నారు. 2022 నుండి ఈ రెండు ఔషధాల కాంబినేషన్ చికిత్సను అన్ని అంతర్జాతీయ చికిత్స మార్గదర్శకాలలో చేర్చారు. కొత్తగా హెచ్ఐవి నిర్ధారించబడిన వారికి రెండు ఔషధాల యాంటీ రెట్రో వైరల్ కాంబినేషన్ చికిత్స విధానాన్ని గుర్తించారు.

కోవిడ్ నుంచి రక్షణకు 'హోమ్‌కేర్'

కోవిడ్-19 ప్రపంచాన్ని కుదిపేస్తున్న సమయంలో ఫేస్‌బుక్ వేదికగా డాక్టర్ మురళీకృష్ణ ప్రజలకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కల్పించారు. డెల్టా వేవ్ ఉధతంగా ఉన్న సమయంలో తేలికపాటి కోవిడ్‌కు మూడు ఔషధాలతో ఇంటి వైద్యం (హోమ్‌కేర్) విధానంపై ప్రచారం చేశారు. ఏస్పిరిన్ - ప్రెడ్నిసొలోన్ - ఎజిత్రోమైసిన్ లతో తేలికపాటి కోవిడ్ జబ్బుకి ఇంటి వద్దనే చికిత్స తీసుకోవడానికి రూపొందించిన హోమ్ కేర్ కిట్టు తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మందికి భరోసాను ఇచ్చింది.

'కోవిడ్-ఎయిడ్స్-నేను' పేరుతో 2022 జనవరిలో ఆయన ప్రచురించిన ఆత్మ కథాత్మక వైద్య ఆరోగ్య గ్రంథం మేధావులు, సామాన్యుల నుంచి ఆదరణ చూరగొంది. కోవిడ్ తర్వాత పెరిగి పోతున్న గుండెపోటు మరణాలను చాలా ముందు గానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారు డాక్టర్ మురళీకృష్ణ. గుండెపోటుకి గురయ్యే ప్రమాదం ఉన్న వారికి అనగా స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహం, స్ట్రోక్, గుండె నొప్పి వంటి రిస్క్ ఫ్యాక్టర్స్ ఉన్నవారిలో గుండెపోటు నిరోధానికి దశాబ్దాలుగా ఏస్పిరిన్ వాడుతున్నారు. గుండెపోటును అరికట్టడంలో ఏస్పిరిన్ గొప్పగా పనిచేస్తుందని రుజువైంది. కోవిడ్ భారిన పడటాన్ని కూడా గుండె పోటుకి దారితీసే రిస్క్‌గా భావించాలి. అందుకే ఒక మోస్తరు నుండి తీవ్రమైన కోవిడ్ జబ్బు బారిన పడ్డ వారు కనీసం రెండేళ్ల పాటు ఏస్పిరిన్ తీసుకోవడం మంచిదని డాక్టర్ మురళీకష్ణ చెబుతున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

కోవిడ్, ఎయిడ్స్ చికిత్సలకు ప్రపంచస్థాయి ప్రాచుర్యం



రెండు ఔషధాల కాంబినేషన్‌తోనే హెచ్ఐవిని అన్ డిటెక్టబుల్ లోడ్‌కు చేర్చొచ్చునని 23 ఏళ్ల క్రితమే ప్రయోగాత్మకంగా నిరూపించాను. 2004 ఫ్రాన్స్‌లో జరిగిన సదస్సులో దీనిపై పరిశోధనా పత్రాన్ని సమర్పించాను. కాలపరీక్షలో నెగ్గిన నా చికిత్సా విధానం ఇప్పుడు ప్రపంచానికి ప్రామాణికంగా ఉంది. 1996 నుంచి ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి చికిత్సలో మూడు లేదా అంతకంటే ఎక్కువ ఔషధాల కాంబినేషన్‌ను అమలు చేస్తున్నారు. హెచ్ఐవి వైరల్ లోడును కనిష్టంగా (అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు గుర్తించలేనంత) తక్కువస్థాయి (అన్ డిటెక్టబుల్)కి తీసుకురావడమనేది హెచ్ఐవి ట్రీట్మెంట్ ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ఈ చికిత్స కోసం అందుబాటులోకి వచ్చిన ఔషధాల సంఖ్య 25కుపైగానే ఉన్నాయి. 2000 ప్రారంభం నుంచి నేను ఎక్కువ మందికి రెండు ఔషధాల కాంబినేషన్ వైద్యాన్ని అందిస్తున్నాను. 2022 సెప్టెంబర్‌లో అమెరికా ప్రభుత్వ హెచ్ఐవి చికిత్సా మార్గదర్శకాలు, అక్టోబర్‌లో యూరోపియన్ ఎయిడ్స్ క్లినికల్ సొసైటీ మార్గదర్శకాల్లోనూ ఈ రెండు ఔషధాల కాంబినేషన్ చికిత్సను చేర్చారు.

-డాక్టర్ యనమదల మురళీకష్ణ

కదం తొక్కిన కోహ్లీ

- వన్డేల్లో 48వ సెంచరీ పూర్తి
- బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు



విరాట్ కోహ్లీ విజయనాదం

పూణే: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. బంగ్లాదేశ్ గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధిం చింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 256పరుగులు చేయగా.. ఛేదనలో టీమిండి యా 41.3ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 261పరుగులు చేసి గెలిచింది. శుభ్‌మన్(53) అర్ధసెంచరీకి తోడు విరాట్ కోహ్లీ(103నాటౌట్) సెంచరీతో కదం తొక్కారు. కోహ్లీ సెంచరీకి చేరువైన దశలో కొంత ఉత్కంఠ నెలకొంది. విజయానికి టీమిండియా రెండు పరుగులు చేయాల్సి ఉండగా.. కోహ్లీ సెంచరీ పూర్తి చేసేం దుకు మూడు పరుగులు అవసరమయ్యాయి. నసూమ్ అహ్మద్ వేసిన 42వ ఓవర్లో మూడో బంతిని కోహ్లీ సిక్సర్ కొట్టి సెంచరీని పూర్తిచేసి భారత్‌ను గెలిపించాడు. ఇక బంగ్లా ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో బౌలింగ్ చేసేందుకు వచ్చిన హార్దిక్ పాండ్యా వేసిన తొలి మూడు బంతులను లిటన్ దాస్ వరుసగా 0, 4, 4 బాదగా.. కుడికాలితో బంతిని అడ్డుకోవాలని చూసి పట్టుతప్పి తన ఎడమకాలిపై పడిపోయాడు. మడిమకు గాయం కావడంతో పాండ్యా మైదానం వీడాడు. దీంతో పాండ్యా ఓవర్‌లో మిగిలిన మూడు బంతులను విరాట్ కోహ్లీ బౌలింగ్ చేసి పూర్తి చేశాడు.

టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా జట్టు ఓపెనర్లు రాణించినా.. మిడిలార్డర్ బ్యాటర్స్ తడబడ్డారు. తాంజిద్ హసన్(51; 43బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లు), లిటన్ దాస్ (66, 82బంతుల్లో 7 ఫోర్లు) తొలివికెట్‌కు 93పరుగులు జతచేశారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత కెప్టెన్ షాంటో(8), మెహిదీ హసన్(3), తౌహిద్ హిందాయ్(16) నిరాశపరిచారు. ఆ తర్వాత వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ (38, 46 బంతుల్లో ఫోర్, సిక్సర్)కి తోడు చివర్లో మహ్మదుల్లా (46; 36బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు) ధాటిగా ఆడాడు. కెప్టెన్ షకీబ్ అల్ హసన్ గైర్హాజరీతో బంగ్లాదేశ్‌కు నజ్ముల్ హెూసెన్ శాంతో సారథిగా వ్యవహరించాడు. బంగ్లాదేశ్ జట్టు తొలి వికెట్‌ను 93 పరుగుల వద్ద కోల్పోయింది. కెప్టెన్ శాంతో(8)ను జడేజా పెవిలియన్‌కు పంపగా.. ప్రమాదకరంగా మారుతున్న మెహిది హసన్ మిరాజ్‌ను సిరాజ్ రెండో స్పెల్‌లో తొలి బంతికే ఔట్ చేశాడు. ఇక లిటన్ దాస్(66)ను జడేజా పెవిలియన్‌కు పంపడంతో బంగ్లా ఆత్మరక్షణలో పడింది. టీమిండియా బౌలర్లలో బుమ్రా, సిరాజ్, జడేజాకు రెండేసి, కుల్దీప్, శార్దూల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో టీమిండియా ఓపెనర్లు శుభ్‌మన్, రోహిత్ కలిసి తొలి వికెట్‌కు 88పరుగులు జతచేశారు. అర్ధసెంచరీకి చేరువైన దశలో రోహిత్(48), శ్రేయస్(19) నిరాశపరిచినా.. కేఎల్ రాహుల్‌తో కలిసి కోహ్లీ మ్యాచ్‌ను ముగించాడు. దీంతో కోహ్లీ వన్డేల్లో 48వ సెంచరీని కొట్టి వన్డేల్లో అత్యధిక సెంచరీలు కొట్టిన సచిన్(49) రికార్డుకు ఒక్క సెంచరీ దూరంలో నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కోహ్లీకి లభించింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
పాకిస్తాన్ × ఆస్ట్రేలియా
(వేదిక: బెంగళూరు; మ.2.00గం॥లకు)



బౌలింగ్ చేస్తూ గాయపడ్డ హార్దిక్ పాండ్యా

స్కోర్‌బోర్డు.. ...**ఇన్నింగ్స్:** తంజిద్ హసన్ (ఎల్‌బి)కుల్దీప్ 51, లింటన్ దాస్ (సి)శుభ్‌మన్ (బి)జడేజా 66, షాంటో (ఎల్‌బి)జడేజా 8, మెహిదీ హసన్ (సి)కేఎల్ రాహుల్ (బి)సిరాజ్ 3, తౌహిద్ హిండే (సి)శుభ్‌మన్ (బి)శార్దూల్ 16, ముష్ఫికర్ రహీమ్ (సి)జడేజా (బి)బుమ్రా 38, మహ్మదుల్లా (బి)బుమ్రా 46, నసుమ్ అహ్మద్ (సి)కేఎల్ రాహుల్ (బి)సిరాజ్ 14, ముస్తాఫిజుర్ (నాటౌట్) 1, షోరిఫుల్ (నాటౌట్) 7, అదనం 6. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 256పరుగులు. **వికెట్ల పతనం:** 1/93, 2/110, 3/129, 4/137, 5/179, 6/201, 7/233, 8/248 **బౌలింగ్:** బుమ్రా 10-1-41-2, సిరాజ్ 10-0-60-2, హార్దిక్ 0.3-0-8-0, కోహ్లీ 0.3-0-2-0, శార్దూల్ 9-0-59-1, కుల్దీప్ 10-0-47-1, జడేజా 10-0-38-2,

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (సి)తౌహిద్ (బి)హసన్ మహ్మద్ 48, శుభ్‌మన్ (సి)మహ్మదుల్లా (బి)హసన్ మిరాజ్ 53, విరాట్ కోహ్లీ (నాటౌట్) 103, శ్రేయస్ అయ్యర్ (సి)మహ్మదుల్లా (బి)మెహిదీ హసన్ 19, కేఎల్ రాహుల్ (నాటౌట్) 34, అదనం 4. (41.3 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 261పరుగులు. **వికెట్ల పతనం:** 1/88, 2/132, 3/178 **బౌలింగ్:** షోరిఫుల్ ఇస్లామ్ 8-0-54-0, ముస్తాఫిజుర్ రహమాన్ 5-0-29-0, నసూమ్ అహ్మద్ 9.3-0-60-0, హసన్ మహ్మద్ 8-0-65-1, మెహిదీ హసన్ 10-0-47-2, మహ్మదుల్లా 1-0-6-0

సింధు సంచలనం

వరుసగా 11 పాయింట్లు సాధించి క్వార్టర్స్‌లోకి..



ఒడెన్సె(డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ సూపర్-500 మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి పివి సింధు ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్‌ఫైనల్లో సింధు 18-21, 21-15, 21-13తో 7వ సీడ్, గ్రెగోరియో మరిస్కాపై సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా మూడో గేమ్‌లో సింధు వరుసగా 11 పాయింట్లు సాధించి మ్యాచ్‌ను ముగించడం విశేషం. తొలి రెండు గేమ్‌లను ఇరువురు ఒక్కోటి గెలుచుకోగా.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు 10-13తో వెనుకబడింది. ఆ దశలో వరుసగా 11పాయింట్లు సాధించి ఆ గేమ్‌ను 21-13తో ముగించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్‌ఫైనల్లో సింధు.. థాయ్‌లాండ్‌కు చెందిన కంటేథోంగ్‌తో తలపడనుంది. మరో పోటీలో కంటేథోంట్ 21-18, 21-8తో భారత్‌కు చెందిన ఆకర్షి కశ్యప్‌ను చిత్తుచేసింది.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	న్యూజిలాండ్	4	4	0	8	+1.92
2.	భారత్	4	4	0	8	+1.65
3.	దక్షిణాఫ్రికా	3	2	1	4	+1.07
4.	పాకిస్తాన్	3	2	1	4	-0.13
5.	ఇంగ్లండ్	3	1	3	2	-0.08
6.	ఆస్ట్రేలియా	3	1	2	2	-0.73
7.	బంగ్లాదేశ్	4	1	3	2	-0.78
8.	నెదర్లాండ్స్	3	1	2	2	-0.72
9.	ఆఫ్ఘనిస్తాన్	4	1	3	2	-1.25
10.	శ్రీలంక	3	0	3	0	-1.53

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రెట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68